Rs. 12/- per copy

UESI

# విద్యార్థి జ్వాల

Vol. 29 - No.3

January 2023



9లో

కృతజ్ఞతతో కూడిన జీవితం

అనుదిన జీవితంలో 4లో

**దేవుని నడిపింపు**



13లో

జోనాథాన్ ఎడ్వర్డ్స్ తీర్మానాలు

ఎడిటోరియల్

# కాపరి అడుగుజాడల్లో...

ఒక పాస్టర్‌గారి దగ్గరకు తన స్నేహితుడు వచ్చాడు. ఆయన చాలా అనారోగ్యంతో, బాధలతో, నిద్రలేమితో తన క్లిష్టపరిస్థితినంతా పాస్టర్‌గారికి చెప్పాడు. అప్పుడు పాస్టర్‌గారు ఆయనతో "నీవు డాక్టర్ దగ్గరికి వెళ్తే మందులు ఇస్తాడు కదా! డాక్టర్ దగ్గరికి వెళ్ళకముందు నేను నీకొక మందు రాస్తాను. దీన్ని పాటిస్తే నీవు మామూలు మనిషివి అవుతావు అని చెప్తాడు. ఆ స్నేహితుడు ఈయన డాక్టర్ కాదు పాస్టర్ కదా! ఏం మందు రాస్తాడా? అని లోలోపల సందేహిస్తూ...కాదనలేక సరేలే అంటాడు. అప్పుడా పాస్టర్ కీర్తన 23 అని చీటీలో రాసిచ్చి ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం పడుకోబోయేముందు దీనిని చదివి, ధ్యానించు, దేవునిమీద ఆధారపడు అని చెప్పినప్పుడు ఆయన అలా చేసి పది రోజుల్లో బాగయ్యాడు. ఎంతోమంది విశ్వాసులు బాధలు, కష్టాలు, శ్రమల గుండా వెళ్తున్నప్పుడు, నాకు ఎవ్వరూ లేరని భావించినప్పుడు, మరణాపాయ పరిస్థితులు వచ్చినప్పుడు ఆదరించిన కీర్తన ఇది. అందుకే దీనిని 'కీర్తనలన్నిటిలో ఒక ముత్యం' అని అంటాడు ఛార్లెస్ స్పర్జన్.

గొర్రెలకాపరిగా దావీదుకు గొర్రెలపట్ల శ్రద్ధ చూపించడమంటే ఏంటో తెలుసు. గొర్రెలను పట్టించుకోకుండా వదిలేస్తే అవి సులభంగా తప్పిపోయి దొంగల బారినో, క్రూరజంతువుల బారినో పడతాయని ఆయనకు బాగా తెలుసు. సరైన మార్గంలో నడిపించే కాపరి, శ్రద్ధగా చూసుకొనే కాపరి లేకపోతే అవి పచ్చికబయలును, మేతను కనుగొనలేకపోవచ్చు. ఈ అనుభవాలన్నిటినీ దృష్టిలో ఉంచుకొని ఈ కీర్తనలో తన ప్రజలపట్ల దేవుడు చూపిస్తున్న శ్రద్ధను, ప్రేమను తన జీవనవృత్తితో పోలుస్తూ అత్యంత రమ్యంగా వర్ణించాడు.

పాతనిబంధనలో యెహోవా తన ప్రజలైన ఇశ్రాయేలీయులకు కాపరిగా ఉంటూ వారి పట్ల ప్రేమను, శ్రద్ధను చూపిస్తూ వారిని నడిపించి, కాపాడి, పోషించాడు. అయితే అనేకసార్లు ఇశ్రాయేలీయులు ఆయనపట్ల నమ్మకంగా జీవించక ఆయనను విసర్జించి, ఆయన హెచ్చరికలను, ఆజ్ఞలను నిర్లక్ష్యం చేసి ఎంతో నష్టం, అవమానం, పతనం కొనితెచ్చుకొన్నారు.

ఈ లోకంలో ప్రతి వ్యక్తికి అనేక సమస్యలు, బాధలు ఉంటాయి. క్లిష్ట పరిస్థితుల్లో, వివిధ సమయాల్లో నిర్ణయాలు తీసుకొనేటప్పుడు ఎలా ముందుకు వెళ్ళాలో తెలియక మనము ఇబ్బందిపడుతుంటాము. ఇలాంటి సమయాల్లో మన జీవితాన్ని మనం నడిపించుకోలేము. మనకొక కాపరి అవసరం. 'ఆ కాపరి మన ప్రభువు, రక్షకుడైన యేసుక్రీసు' (యోహాను 10:11). ఈ కాపరి తోవతప్పిన మనమీద కనికరపడి, మనకోసం తన ప్రాణాన్ని పెట్టాడు (యోహాను 10:11,15), ఈ కాపరికి మనమెవ్వరమో తెలుసు (యోహాను 10:15,27), మనకు నిత్య జీవాన్ని ఇచ్చాడు (యోహాను 10:28), మనకు భద్రతను ఇస్తున్నాడు (యోహాను 10:28).

ఈ కాపరి అడుగుజాడల్లో నడవడం మన జీవితానికి అన్నివిధాల క్షేమం. విశ్వాసులంగా ఈ కాపరిని నమ్మాలి (యోహాను 10:26), ఆయన స్వరాన్ని వినాలి. ఆయనను వెంబడించాలి (యోహాను 10:27). ప్రభువు స్వరాన్ని మనం ఎలా వినగలం? దేవుని వాక్యం ద్వారానే. 'దేవుని వాక్యమే దేవుని స్వరం' అని అంటాడు ఛార్లెస్ స్విండాల్. ప్రతి దినం కాపరి స్వరాన్ని వింటూ, ఆయన మాటలను విశ్వసిస్తూ ఆయనను వెంబడిస్తే ఏ కీడుకు, శత్రువుకు, రేపటికి భయపడాల్సిన పనిలేదు. గాంఢాధకారలోయలు లాంటి సమస్యలు మనకు వచ్చినా ఆయన దుడ్డుకర్ర, దండము మనల్ని ఆదరిస్తుంది. కొన్నిసార్లు మన జీవితంలో క్లిష్టమైన సంఘటనలు ఎందుకు జరుగుతాయో మనకు అర్థం కానప్పటికీ, అలాంటి సమయాల్లో కూడా మన కాపరి మనతో ఉన్నాడనే విషయాన్ని గ్రహిస్తాం. ఆయనను ఆశ్రయిస్తే మనల్ని ముందుండి నడిపిస్తాడు.

నేటి విశ్వాసులు "నిన్నటి బాధలు, రేపటి వేదనలు అనే ఇద్దరు దొంగల మధ్య సిలువవేయబడ్డారు" అని అంటాడు ఒక వేదాంత పండితుడు. తత్ఫలితంగా నేటి ఆనందాన్ని, శాంతిని, సమాధానాన్ని పొందలేకపోతున్నారు. "ఎల్లప్పుడును ప్రభువునందు ఆనందించుడి. మరల చెప్పుదును ఆనందించుడి. మీ సహనమును సకలజనులకు తెలియబడనియ్యుడి, ప్రభువు సమీపముగా ఉన్నాడు. దేనిని గూర్చియు చింతపడకుడి, గాని ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనముల చేత కృతజ్ఞతాపూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి. అప్పుడు సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము యేసుక్రీస్తు వలన మీ హృదయములకును మీ తలంపులకును కావలి యుండును" (ఫిలిప్పీ 4:4-7) అని దేవుని వాక్యం తెలియజేస్తుంది. ఆయన స్వరాన్ని వింటూ నిండుమనస్సుతో ప్రతిదినం అనుసరిస్తూ ఉంటే నిన్నటి, నేటి, రేపటి శ్రమల్లో, బాధల్లో కూడా నెమ్మదిని, ఆయన నడిపింపును అనుభవిస్తాము. కాపరిగా నడిపించడానికి ఆయన సిద్ధమే, మరి గొర్రెలుగా ప్రతిదినం నడవడానికి మనం సిద్ధమేనా?

ఒక సండేస్కూల్ కాంపిటీషన్‌లో అందరూ ఈ కీర్తనను చెబుతుంటే ఒక అమ్మాయి "యెహోవా నాకాపరి నాకు లేమి కలుగదు అని చెప్పబోయి "యెహోవా నా కాపరి నాకు కావాల్సింది అంతే' అని చెప్పి కూర్చుంటుంది. ఈ నూతన సంవత్సరంలో కూడా మనకు కావాల్సింది అంతే.

– పి. సునీల్ జాకబ్

# విద్యార్థి జ్వాల

Vol. 29, No.3 January 2023
A Publication of
UESI Publication Trust





ప్రభువునందు ప్రియమైన

## విద్యార్థి జ్వాల

పాఠకులకు

## నూతన సంవత్సర శుభాకాంక్షలు

**- ఎడిటోరియల్ బోర్డ్**


EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Honorary Editor
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Dr. J. Subbarao - Sec., Litt.Dept.



CONTACT:

The Editor, Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com



GIFTS & SUBSCRIPTIONS:

Can be made by Cheque/DD/MO
in favour of UESI-AP,
Abhishek Nagar, Nambur - 522 508
ANNUAL: GRADUATES - Rs.250
STUDENTS - Rs. 120
LIFE INLAND - Rs. 2000
LIFE OVERSEAS - US $ 150

VIDYARTHI JWALA ACCOUNT NO:

**SBI - 36698741798**
**IFS Code: SBIN0011994**
**uesiap vj, Nambur Branch**

GENERAL CONTRIBUTIONS ACCOUNT NO:

**SBI - 10949477628**
**IFS Code: SBIN0000844**
**Commercial Branch, Guntur**

LITERATURE ACCOUNT NO:

**SBI - 36698741437**
**IFS Code: SBIN0011994**
**uesiap pt, Nambur Branch**

**Please inform/ SMS to**
**Mr. A. Venu, Accountant (9849516060)**
**Email: <uesiapacc84@gmail.com>**


TOPICS:

February: Discipleship
March: Improving member care
April: Expansion of the Ministry
May: Mission Partnership
June: Building Christlike leadership

**Note:** Please send your writeups on or before
**10th of every month**

## లోపలి పేజీల్లో...


- కాపరి అడుగుజాడల్లో - 2
- అనుదిన జీవితంలో దేవుని నడిపింపు - 4
- కృతజ్ఞతతో జీవించడం - 9
- జోనాథాన్ ఎడ్వర్డ్స్ తీర్మానాలు - 13
- వికసించిన పుష్పాలు - 17
- ఇకనైనా ఫలిస్తా - 20
- గర్వం - 21
- నిరీక్షణకు పది ఆశీర్వాదాలు - 24
- యథార్థత - 26
- బైబిల్ క్విస్ట్ - 28
- ఆయుష్కాలము నీ వరమే! - 29
- కోశాధికారి లేఖ - 31

# అనుదిన జీవితంలో దేవుని నడిపింపు

'నీ స్వబుద్ధిని ఆధారము చేసికొనక నీ పూర్ణ హృదయముతో యెహోవా యందు నమ్మికయుంచుము. నీ ప్రవర్తన అంతటియందు ఆయన అధికారమునకు ఒప్పుకొనుము. అప్పుడు ఆయన నీ త్రోవలను సరాళము చేయును. నేను జ్ఞాని కదా అని నీవనుకొనవద్దు' - సామెతలు 3:5-7

జార్జిముల్లర్ ప్రఖ్యాత క్రైస్తవ సువార్తికుడు, ప్రార్థనా పరుడు, విశ్వాస వీరుడు. దేవుని మీద ఆధారపడి రెండు వేల మందితో చిన్నపిల్లల అనాథాశ్రమం నడిపాడు. అనాథ పిల్లల కోసం 177 స్కూల్స్‌ను స్థాపించాడు. ప్రార్థన, విశ్వాసంతో ఎన్నో గొప్పకార్యాలు జరిగించాడు. ప్రతిదినం తన అవసరాలను ఇతరులెవ్వరికి చెప్పకుండా ప్రార్థనాపూర్వకంగా దేవుని మీద ఆధారపడుతూ, దేవునివైపు చూస్తూ, సమస్తం ప్రార్థన ద్వారా పొందుకొన్నాడు. ఒకసారి ఆయన స్నేహితుడు, అనాథాశ్రమం అవసరాల కోసం స్థానిక న్యూస్ పేపర్స్‌లో అడ్వర్టైజ్ చేసి ఫండ్‌రైజ్ చేద్దామంటే వద్దంటాడు. మరెలా పోషిస్తావంటే 'ప్రార్థన ద్వారా' అంటాడు. 'దేవుడైనా ఏదో ఒక మార్గం ద్వారానే కదా పంపేది గనుక మనం అడ్వర్టైజ్ చేద్దామంటే 'దేవుడే ఆ మార్గాల్ని ఎంచుకోనీ' అని అంటాడు. ఎలాంటి విశ్వాసం! దేవుడు ఆ అనాథాశ్రమం ప్రతి అవసరాన్ని తీర్చినట్లు జార్జిముల్లర్ గారి జీవిత చరిత్రలో చదువుతాము. ఇప్పటికి అదే నియమంపై ఆ ఆశ్రమాన్ని నడిపిస్తున్నారు.

బిల్లీగ్రేహం గారు తన డెసిషన్ మ్యాగజైన్‌లో పరిశుద్ధాత్మతో నడిపించబడడం ఎలాగో చెబుతూ, "సాక్ష్యం చెప్పడానికి సహాయం చేయమని దేవునిని అడిగితే, నీవు సాక్ష్యం చెప్పడానికి మొదట పైకి లేచి నిలబడు, అప్పుడు దేవుని సహాయాన్ని చూస్తావు" అన్నాడు. ఆత్మ దేవుని నింపుదలను, నడిపింపును కోరుకొన్నట్లయితే, అది నీ పట్ల దేవుని చిత్తము గనుక ప్రార్థించి, ఆ దిశలో ముందుకు అడుగులు వేస్తే ఆశ్చర్యకరమైన ఆయన నడిపింపును చూస్తాము.

"దేవుని చిత్తాన్ని ఎరగడం, దానిని నెరవేర్చడం మానవ జీవితానికి ఉన్న ఉన్నతమైన ఆధిక్యత" అని అంటాడు భక్తసింగ్ గారు. భక్తసింగ్ గారు ప్రతి విషయానికి దేవునిని అడుగుతూ ఉంటే 'ఇది కామన్‌సెన్స్ పాయింట్' కదా, దీనికి కూడా



దేవుని అడగడం ఎందుకు అని కొంతమంది అంటే, ఆయన 'నా కామన్‌సెన్స్ దేవుడే' అన్నారు. ఆయన అంతగా దేవునిపై ఆధారపడ్డాడు. ఒకసారి, క్రాఫ్ చేయించుకోవడానికి ప్రార్థిస్తే, దేవుడు ఒక బార్బర్ షాప్‌కి నడిపించారు. క్రాఫ్ చేయించుకొనే సమయంలో ఆ క్రాఫ్ చేసే వ్యక్తికి సువార్త చెబితే, అతను ప్రభువుని నమ్మాడు. కొంతమంది దేవుని సేవకులు జీవితాలలో జరిగించిన పనులు, దేవుడు వారిని నడిపించిన విధానం ఆశ్చర్యం కలిగించేవిగా ఉంటాయి.

వారిని నడిపించిన దేవుడు ఇప్పుడు కూడా ఉన్నాడు. అయితే అంతలా దేవునిపై ఆధారపడేవారు, దేవునిచేత నడిపించబడాలనే కోరిక కలిగిన విశ్వాసులు కావాలి.

దేవుని వాక్యం పట్టాలు అయితే, నడిచే ట్రైన్ మనం అవుతాము, మనలను ముందుకు తీసుకొని వెళ్ళే ఇంజన్ పరిశుద్ధాత్ముడు అవుతారు. పరిశుద్ధాత్మతో, వాక్యంతో మనం ఎక్కువ సహవాసం కలిగి ఉంటే వారు మనలను వాగ్దానాలలోకి నడిపిస్తారు.

**అనుదిన జీవితంలో దేవునిచే నడిపించబడాలంటే ఉండాల్సిన లక్షణాలు ఏమిటి?**

**1. అనుదిన జీవితంలో దేవునిచే నడిపించబడాలనే కోరిక ఉండాలి**

ప్రతి విశ్వాసికి నేను దేవుని చేత నడిపించబడాలనే గొప్ప ఆశ, కోరిక తప్పకుండా ఉండాలి. మన జీవితంలో మనకుండే కోరికలు, ఆశల ప్రకారమే మన జీవనశైలి ఉంటుంది. లోకసంబంధమైన కోరికలు మనకు ప్రాధాన్యమైతే అలానే జీవిస్తాం లేదా, దైవిక సబంధమైన కోరికలు ఉంటే వాటి ప్రకారం జీవిస్తాం. అలాగే అనుదిన జీవితంలో దేవునిచే కాపాడబడాలని కోరుకోవాలి. ప్రభువు నేర్పిన ప్రార్థన ఈ విషయంలో ఒక నమూనా వంటిది.

**2. నడిపించబడడం కొరకు దేవునితో సమయం గడపాలి**

ఎ. క్రమం తప్పకుండా బైబిల్ చదవాలి/ధ్యానించాలి/ అనుసరించాలి.

బి. ప్రార్థించాలి - రోజుకి కనీసం - విద్యార్థులైతే 1 గంట, గ్రాడ్యుయేట్స్ అయితే 2 గంటలు, స్టాఫ్ అయితే 3 గంటలు.

'దేవునితో నీవు గడిపే సమయం నీ ప్రవర్తనను

**ఎంతోమంది, దేవుని బిడ్డలు, దేవుడు అనుగ్రహించిన కృపను కామాతురతకు ఉపయోగించుకొంటున్నారు. పాపానికి చోటిచ్చేవారు, ప్రభువును దూరపరచుకొంటారు.**

మారుస్తుంది, నీ భక్తిజీవితాన్ని పెంపొందిస్తుంది, సరైన మార్గంలో పయనించేటట్లు చేస్తుంది. ఇలాంటి జీవితం జీవిస్తున్నప్పుడు దేవునిని విశ్వసించని ఈ లోకం దేవునిని తెలుకొంటుందని' ఛార్లెస్ స్టాన్లీ అంటారు.

**3. పరిశుద్ధాత్మతో నింపబడాలి (ఎఫెసీ 5:19), పరిశుద్ధాత్మను దు:ఖపరచకూడదు (ఎఫెసీ 4:30), ఆత్మను ఆర్పకూడదు (1 థెస్స 5:19)**

ఈ వాక్యభాగాల్లో మనం ఏంచేస్తే, పరిశుద్ధాత్ముడు మనలో ప్రజ్వరిల్లుతాడో చెప్పబడినది. ఎడతెగక ప్రార్థన చేయుడి, ఎల్లప్పుడూ సంతోషముగా ఉండుడి. ప్రతి విషయంలో కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి అని దేవుని వాక్యం చెబుతుంది. ఇలా చేయడం సాధ్యమేనా అని అనిపిస్తుంది. కానీ అసాధ్యమైన విషయం మనం చేయాలని దేవుడు మనకు చెప్పడు. ఇది మన నిర్ణయానికి సంబంధించిన విషయం. ఎలాంటి పరిస్థితులైనా సంతోషంగా ఉంటూ, ఎడతెగక ప్రార్థన చేస్తూ మన ఆత్మ ఎల్లప్పుడు ప్రార్థనలో దేవుని సన్నిధిలో ఉండవచ్చు. అది కష్ట, నష్టమైన విషయాలైనా హృదయంలో పెదవులతో దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించి మన జీవితాన్ని ఆయనకు అప్పగించుకోవాలి. అప్పుడు పరిశుద్ధాత్మ దేవుని నింపుదల చూస్తాము. అలా కాకుండా పరిస్థితులను బట్టి సణగడం, గొణగడం, దిగులుపడడం, కలవరపడడం చేస్తే పరిశుద్ధాత్ముని దు:ఖపరుస్తాము, ఆర్పివేస్తాము. అ.కా. 16:19-34లో పౌలు, సీలను తీవ్రంగా దెబ్బలు కొట్టి ఫిలిప్పీలోని జైలులో వేసినప్పుడు, అర్ధరాత్రివేళ సణగడానికి, గొణగడానికి, దిగులుపడి, విచారపడడానికి ఎంతో అవకాశం ఉంది కాని, వారు ఆ స్థితిలో ప్రార్థిస్తూ, పాటలు పాడుతూ, స్తుతించడం

ఆరంభించినప్పుడు, విచిత్రమైన భూకంపం వచ్చి వారి బంధకాలు ఊడిపోయాయి. ఆ అర్థరాత్రి జైలు అధికారి అతని కుటుంబం రక్షించబడినట్లు చూస్తాము. ఫలితంగా ఫిలిప్పీ సంఘము ఏర్పడింది.

## 4. పరిశుద్ధాత్ముని మెల్లని స్వరం వినడం అల వర్చుకోవాలి (1 సమూ 3:4,6,8,10)

సమూయేలు బాలుడైయున్నప్పుడే దేవుని స్వరాన్ని విన్నాడు. ఈ సమయంలో సమూయేలు జీవితాన్ని గూర్చి, వాక్యంలో చెప్పబడిన మాటలు చూస్తే, 1. యెహోవాకు ప్రతిష్టితుడు. 2 యెహోవాకు పరిచర్య చేయుచుండెను. 3. యెహోవా దయయందును, మనుష్యుల దయయందును ఎదుగుచుండెను. కొత్తనిబంధనలో మన గూర్చి దేవునివాక్యం ఇలా చెబుతుంది. 'నా గొఱ్ఱెలు నా స్వరము వినును (యోహాను 10:27). దేవుని ఆత్మచేత ఎందరు నడిపింపబడుదురో వారందరు దేవుని కుమారులైయుందురు (రోమా 8:14). దేనిని గూర్చి చింతపడకుడి గాని ప్రతి విషయంలోను ప్రార్థన విజ్ఞాపనలచేత కృతజ్ఞతాపూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి. అప్పుడు సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము యేసుక్రీస్తు వలన మీ హృదయములకును, మీ తలంపులకును కావలియుండును (ఫిలిప్పీ 4:6,7). ఏ విషయం గూర్చి అయినా మనం ఆలోచిస్తున్నప్పుడు లేదా ప్రార్థిస్తున్నప్పుడు దేవుని సమాధానం లేదా అభిషేకం (1యోహాను 2:26,27) మనలో నిలిచినప్పుడు దేవుని నడిపింపును గ్రహించగలుగుతాము.

### మనలో దేవుని నడిపింపు ఇలా ఉండవచ్చు

1. ఆ విషయం గూర్చి మన హృదయంలో గొప్ప సమాధానము.
2. ఆత్మలో పరిశుద్ధాత్మ దేవుడు మెల్లని స్వరం ద్వారా మాట్లాడడం.
3. ప్రార్థనలో ఉన్నప్పుడు దేవుని దర్శనము (ఉదా: కొర్నేలీకి కలిగిన దర్శనం)
4. కలల ద్వారా దేవుని నడిపింపును పొందడం (ఉదా: మరియ భర్త యోసేపుకి వచ్చిన నడిపింపు, పాత నిబంధనలో యోసేపు)
5. దైవ వర్తమానికుడు, వర్తమానము అందించేటప్పుడు
6. దేవుని సహవాసము, దేవుని బిడ్డల సహవాసములో ఉన్నప్పుడు (ఉదా: అబ్రహాము. అ.కా. 13:2, ఆది 18:4).
7. బైబిల్ చదివేటప్పుడు (మౌన ధ్యానం) పరిశుద్ధాత్ముడు ఒక ప్రత్యేక వాక్యాన్ని మనకు వెలిగింపు ఇవ్వడం ద్వారా.

## 5. యోసేపును దేవుడు కలల ద్వారా నడిపించడం

అ.కా. 37 అధ్యాయం మొదలు ఆ గ్రంథం చివరి వరకు చూస్తే, యోసేపు జీవితంలో దేవుని యొక్క నడిపింపును 3 సార్లు పొందినట్లు గమనించగలము. అంతేకాదు, దేవుని సన్నిధిని, సహాయాన్ని, ఆశీర్వాదాన్ని ప్రతి అడుగులో చూస్తాము. మొదటిగా దేవుడు తాను ఏలిక కాబోచున్నాడనే విషయాన్ని కలల ద్వారా బయలుపరిచారు. అప్పటినుండి అతని జీవితంలో సుమారు 13 సం॥లు శ్రమలు వస్తాయి. కానీ వాటన్నిటినిలో దేవుని హస్తాన్ని చూస్తాడు. ఐగుప్తులో పోతీఫరు ఇంటిలో ఉన్నప్పుడు ఆ ఇంటికి ఆశీర్వాదం వచ్చింది. అతనితో దేవుని సన్నిధి ఉండబట్టే వ్యభిచార పాపములో పడలేదు. జైలులో కూడా దేవుని సన్నిధిని అనుభవించాడు. జైలు నుండి అద్భుతంగా బయటకు వచ్చి అనేకమందిని ముఖ్యంగా, ఇశ్రాయేలీయులను ఆ కరువునుండి రక్షించి, పోషించడం, అది గొప్ప దేవుని ప్రణాళికగా గమనించగలం. మన ప్రభువులో ఉన్న క్షమాపణ గుణాన్ని యోసేపులో చూస్తాము. తనకు అంత హాని తలపెట్టిన అన్నలను, సంతోషంగా, సంపూర్ణంగా క్షమించగలిగాడు. ఎందుకంటే, తన మార్గమంతటిలో దేవుని హస్తాన్ని చూశాడు గనుక.

## 6. దావీదు జీవితంలో దేవుని నడిపింపు

దేవుని సన్నిధిని, సహాయాన్ని, కాపుదలను, ఆశీర్వాదాన్ని అధికంగా అనుభవించిన వారిలో రాజైన దావీదు ముందు వరుసలో ఉంటాడు. దావీదు దేవుని అభిషేకం పొందినవానిగా చూస్తాము. ఆ అభిషేకము అతనిని ఇశ్రాయేలు చరిత్రలో గొప్ప విశ్వాసవీరునిగా, యుద్ధవీరునిగా, రాజుగా, ఇశ్రాయేలు దేవుని మధుర గానము చేసినవానిగా, దేవుని హృదయానుసారునిగా నిలబెట్టినది. దావీదు తాను పొందిన అభిషేకాన్ని బట్టి ప్రతి పరిస్థితి, సమస్యకు పరిష్కారాన్ని దేవునిలో చూడడం నేర్చుకొన్నాడు. చిన్నవాడిగా ఉన్నప్పుడే, సింహముతో,



ఎలుగుబంటితో, గొల్యాతుతో, అసాధ్యమైన పోరాటం చేయాల్సి వచ్చినప్పుడు, దేవుని ద్వారా వాటిని చూడడం, పోరాడడం నేర్చుకొన్నాడు. వాటన్నిటిలో అత్యధిక విజయాన్ని పొందాడు. దావీదు కీర్తన 23వ అధ్యాయం ఇప్పటికి, ఎప్పటికి అనేక కోట్లమందికి, ధైర్యాన్ని ఇస్తుంది.

దేవునిని తమ కాపరిగా ఎంచుకొన్నాడు కాబట్టి, అనుదిన జీవితములో అనేక శోధనలు, ప్రాణాపాయములు సంభవించినను, వాటన్నిటి నుండి దేవుడు విడిపించాడు (1 సమూ 23:14).

దావీదు రాజుగా, సైన్యాధిపతిగా అనేక యుద్ధాలు చేశాడు. వాటన్నిటిలో, దేవుని సహాయాన్ని, సలహాను పొందినట్లు మనం చూస్తాము (1 సమూ 23:2,4,10,11). దావీదు 1 సమూయేలు 30వ అధ్యాయంలో తన పట్టణమైన సిక్లగు కొట్టబడి, తగలు పెట్టబడి, వారి భార్యల్ని, పిల్లల్ని శత్రువులు తీసుకొనిపోగా, ఇక ఏడ్వడానికి శక్తి లేనంతగా ఏడ్చిన సందర్భంలో, తనతో ఉన్నవారే, విసిగి, దావీదును రాళ్ళు రువ్వి చంపాలని అనుకొంటారు. అప్పుడు దావీదు, యెహోవా యొద్ద విచారణ చేసినట్లు చూస్తాము. దేవుడు ఆ శ్రమలోనుండి బయటపడే మార్గమును తెలియజేస్తాడు. తరువాత 19వ వచనంలో, కుమారులేమి, కుమార్తెలేమి దోపుడు సొమ్మేమి వారు ఎత్తుకొనిపోయిన దానంతటిలో కొద్దిదేమి, గొప్పదేమి యేదియు తక్కువ కాకుండా దావీదు సమ్మతమును రక్షించెను అని చదువుతాము. దావీదు, దేవుని సంతోషపరిచే విధంగా జీవించాడు. అందువల్ల దేవుని సన్నిధి, సహవాసము, నడిపింపు ఎల్లప్పుడూ పొందగలిగాడు.

## 7. అపొస్తలుడైన పౌలు జీవితంలో దేవుని నడిపింపు

క్రొత్త నిబంధనలో అపో.పౌలు అనుదినము దేవునితో నడిచినవానిగా చూస్తాము. దమస్కు మార్గములో పొందిన ఆ దర్శనానికి విధేయుడై సువార్త ప్రకటనకే తన జీవితాన్ని అర్పించినట్లు చూస్తాము (అ.కా. 26:13-22). సమస్యలలో, కష్టాలలో, ఇబ్బందులలో, శ్రమలలో ఆయనను దేవుడే కాపాడి సహాయం చేసినట్లు చెప్పుకొచ్చాడు. "అయినను నేను దేవుని వలన సహాయము పొంది నేటివరకు నిలిచి ఉంటినని, రాజైన అగ్రిప్ప ఎదుట సాక్ష్యము పలికాడు. పౌలు పరిశుద్ధాత్మునితో ఎక్కువ సహవాసం కలిగి ఉన్నాడు. అ.కా. 13:2లో వారు ప్రభువుని సేవించుచు ఉపవాసము చేయుచుండగా, పరిశుద్ధాత్మ నేడు బర్నబాను, పౌలును పిలిచిన పని కొరకు వారిని నాకు ప్రత్యేకపరచుడని వారితో చెప్పెను. గనుక పౌలు ప్రమాదాలు, ప్రయాస, సేవ, అంతా పరిశుద్ధాత్ముని ఆధ్వర్యంలో జరిగినది.

తన సేవలో ఎదుర్కొన్న శ్రమలలో దేవుని సహాయాన్ని, నడిపింపును, మరణాన్ని, జీవాన్ని కూడా చూశాడు. అ.కా. 27 అధ్యాయంలో, పౌలు రోమా పట్టణానికి కైసరు న్యాయతీర్పుకు వెళ్తున్నప్పుడు గొప్ప తుఫాను వారిని ముంచివేసే పరిస్థితి వచ్చింది. 15 రోజులు సూర్యుడిని, నక్షత్రాలనైనా చూడలేదు. బతుకుతారో, చనిపోతారో తెలియని పరిస్థితిలో ప్రభువు తన దూతను పంపి, పౌలును బలపరిచాడు. అ.కా. 27:23లో 'నేను ఎవనివాడనో, ఎవని సేవించుచున్నానో ఆ దేవుని దూత గడిచిన రాత్రి నాయొద్ద నిలిచి - పౌలా, భయపడకుము నీవు కైసరు యెదుట నిలువవలసియున్నదని నాతో చెప్పెను" గనుక పౌలు శ్రమలలో దేవునికి దగ్గరగా జీవించాడు. ఆ ఓడలో మొత్తం 276 మంది ఉన్నారు. వారందరూ దేవుని మాట విన్నారు, రక్షణను చూశారు, దేవుని కార్యాలు పౌలు ద్వారా చూశారని నేను అనుకుంటున్నాను. అందరూ రక్షింపబడినరీతిగా, వారి ఇండ్లకు, సువార్తను మోసుకొనిపోయి ఉంటారు. ఆ భయంకరమైన అనుభవము వారి జీవితాల్లో నిత్యమైన రక్షణ పొందిన అనుభవంగా, నిజ దేవుని అనుభవంతో నింపినది. అందువలననే పౌలు నోట ఎంత నిరీక్షణ కలిగిన మాటలు మనం వింటాము. 1 థెస్స 4:13-8; ఫిలిప్పీ 1:23; 2 కొరింథీ 5:8,9;

2 తిమోతి 4:6-8 లలో పౌలు యొక్క పరలోక నిరీక్షణను మనం చూస్తాము.

## దేవుడు తోడుగా ఉండాలంటే మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు

మన జీవితాన్ని గూర్చి జాగ్రత్త పడకుండా, దేవుని కృపను సరిగా అర్థం చేసుకోకుండా, మన దేవుడు ప్రేమించే దేవుడు అనుకొని, విచ్చలవిడిగా జీవించి, సాతానుకు చోటిచ్చి నష్టపోయిన వారిని బైబిల్‌లో మనం చూడవచ్చు. న్యాయాధిపతులలో సమ్సోను గూర్చి చదువుతాము. ఇతను పుట్టుకతోనే దేవునికి నాజీరు చేయబడినవాడుగా, దేవుని ఆత్మను కలిగినవానిగా, ఇశ్రాయేలీయులను ఫిలిష్తీయుల నుండి రక్షించే నాయకునిగా దేవుడు పుట్టించాడు. అయితే అతను స్త్రీల వ్యామోహంలో పడి పాపాన్ని విడవలేక, పూర్తిగా బానిసై దెలీలా ఒడిలో నిద్రపోయాయాడు. తనలోని దైవిక శక్తి రహస్యాన్ని శత్రువుకి చెప్పి, తన చావు తానే తెచ్చుకొన్నాడు.

ఎంతోమంది, దేవుని బిడ్డలు, దేవుడు అనుగ్రహించిన కృపను కామాతురతకు ఉపయోగించుకొంటున్నారు. పాపానికి చోటిచ్చేవారు, ప్రభువును దూరపరచుకొంటారు. ఎంతగా అంటే, యెహోవా తనను ఎడబాసెనని అతనికి తెలియలేదు (న్యాయా 16:20). గనుక దైవజనుడైన పౌలు, 'నీవు యౌవనేచ్ఛల నుండి పారిపొమ్ము (2 తిమోతి 2:22) అని యౌవనుడైన తిమోతికి రాశాడు. ఇదే మాటను దేవుడు ప్రతి గ్రాడ్యుయేట్‌కు, ఇయు విద్యార్థికి చెబుతున్నాడు. ఇంకొక చోట జారత్వమునకు దూరముగా పారిపో అనే హెచ్చరికను ఇచ్చాడు (1 కొరింథీ 6:18). దేవుని నడిపింపును కోరుకొనేవారు, తప్పక తమ ప్రవర్తనను వాక్యానుసారంగా ఉందా లేదా అనేది పరీక్షించుకోవాలి. సరిదిద్దుకోవాలి లేకుంటే మనం కూడా దెలీలా చేతిలో, జుట్టు కత్తిరించబడి, శక్తి, దృష్టి కోల్పోయి, తిరగలి విసిరే వారమౌతాము. జాగ్రత్త!

## దేవుని నడిపింపును కోల్పోయిన సౌలు రాజు

ఇశ్రాయేలుకు మొదటి రాజైన సౌలు జీవితాన్ని పరిశీలించినప్పుడు మనకు విచారం కలుగుతుంది. ఎందుకంటే, అతని చూసినపుడు అన్నివిధాలుగా రాజుకి తగిన స్థితిని కలివున్నాడు.



ఇశ్రాయేలీయులందరికంటే, ఎత్తరి, అందగాడు, పరాక్రమశాలి, దేవుడు అతనిని రాజుగా బలపరచాలని అనుకొన్నాడు. అయితే, ప్రజల ఒత్తిడికి, పరిస్థితుల ఒత్తిడికి లొంగి దేవుని ఆజ్ఞను, నిర్ణయాన్ని మీరి సొంత ఆలోచనలతో దేవునికి వ్యతిరేకమైన పనులు చేస్తూ పోయాడు. గనుక సమస్యలవైపు చూస్తే, మనం కూడా ఒత్తిడికి లోనై దేవుని ఏర్పాటులో నుండి బయటకు పోతాము. ఏమైనా సరే, మేము దేవుని కొరకు కనిపెట్టుకొంటాము అంటే, జయించేవారిగా ఉంటాము. ప్రభువు అన్నారు 'నన్ను ఘనపరచువారిని నేను ఘనపరచుతాను. నన్ను తృణీకరించువారు, తృణీకారమొందుతారు (1 సమూ 2:30). తాను సెలవిచ్చిన ఆజ్ఞను ఒకడు గైకొనుట.. సంతోషించును. బలులు అర్పించుట కంటే ఆజ్ఞ గైకొనుటయు మాట వినుటయు క్షేమము (1 సమూ 15:22,23).

సౌలు, దేవుని వైపు తిరుగక, అసూయ, ద్వేషము క్షమించలేనితనం, మోసకరమైన ఆలోచనలతో సాతానుకి చోటిచ్చినప్పుడు, యెహోవా ఆత్మ సౌలును విడిచిపోయి, యెహోవా యొద్ద నుండి దురాత్మ ఒకటి వచ్చి అతనిని వెరపింపగా.. (1 సమూ 16:14) అని మనం చదువుతాము. ఎంత విచారం!! గనుక మన జీవితంలో, ఇటువంటివి సంభవించకుండా జాగ్రత్తపడదాం. దేవుడు యెహోషువాతో చెప్పిన మాటలు జ్ఞాపకముంచుకొందాము (యెహో 1:8,9).

### ఈ ధర్మశాస్త్ర గ్రంథమును (బైబిల్‌ను)

- దివారాత్రము దాని ధ్యానించుము
- బోధించుము
- వాటి ప్రకారము చేయటకు జాగ్రత్తపడుము.

నీవు నడుచు మార్గమంతటిలో నీ దేవుడైన యెహోవా నీకు తోడైయుండును. ఆమెన్!!

**– డా. టి. జోసఫ్,** మచిలీపట్నం





# కృతజ్ఞతతో జీవించడం

*"మనం కేవలం కృతజ్ఞతాభావాన్ని మాత్రమే అనుభవించాలని దేవుడు కోరుకోడు, కానీ దేవునికి కృతజ్ఞతలు చెబుతూ దానిని మన జీవితాలతో చూపించాలని కోరుకొంటాడు."*

*– ఆర్.సి. స్ప్రోల్*

పాలికార్ప్ (క్రీ.శ. 70–156) యోహాను శిష్యుడు, స్ముర్నకు బిషప్పు. 86సం॥ల వయసులో ఆయనను ఒక కొయ్యకు కట్టి తగులబెట్టారు. నీ విశ్వాసాన్ని విడిచిపెట్టమని గవర్నర్ పాలికార్ప్‌ను అడిగినప్పుడు "ఎనభై ఆరేళ్ళు ఆయనను సేవించాను. ఆయన నాకే హాని చేయలేదు. నన్ను రక్షించిన నా రాజును గూర్చి నేను దూషణలెలా మాట్లాడగలను?" అని గొప్ప శబ్దంతో చెప్పాడు. ఆయన చనిపోయేముందు "సర్వశక్తిమంతుడవైన ప్రభువా, నీ సాక్షులలో ఒకనిగా ఉండడానికి నన్ను యోగ్యునిగా ఎంచినందుకు నేను నిన్ను స్తుతించుచున్నాను. నిత్యమూ నీకే మహిమ కలుగును గాక! ఆమేన్!" అని చెబుతాడు. చనిపోయే సమయంలో కూడా దేవునిపట్ల కృతజ్ఞతా జీవితం కలిగి, ఆయనను స్తుతిస్తూ, మహిమపరచడం నేటి విశ్వాసులకు గొప్ప మాదిరి. "మరణము వరకు నమ్మకముగా నుండుము నేను నీకు జీవకిరీటమునిచ్చెదను" అనే ఈ మాటలు పాలికార్ప్‌కు కూడా వర్తిస్తాయి.

"ఇరుకైన గదిలో, కాళ్ళకు చేతులకు సంకెళ్ళతో, అన్యాయంగా నిందలు, శ్రమలు, హింసలు, బాధలు భరిస్తూ, చెరసాలలో మగ్గిపోతున్న అపొస్తలుడైన పౌలు, తన పరిస్థితిని బట్టి ఫిర్యాదు చేయడానికి అర్హత ఉన్నా అతని హృదయం ప్రభువు పట్ల ప్రేమతో, కృతజ్ఞతతో నిండి, ఆయనను స్తుతిస్తూ, ప్రతి విషయంలో కృతజ్ఞతాస్తుతులు చెల్లించమని విశ్వాసులను ప్రోత్సహించాడు (ఎఫెసీ 5:19–20, ఫిలిప్పీ 4:4–7). ప్రతికూల పరిస్థితుల్లో కూడా కృతజ్ఞతాపూర్వకంగా ఎలా జీవించాలో ఆయనకు బాగా అర్థం అయ్యింది. అలానే జీవించాడు.

## కృతజ్ఞత అంటే?

దేవుడు చూపించిన అత్యున్నతమైన కృపకు మన ప్రతిస్పందనే కృతజ్ఞత. దేవుడు చేసిన అనేక మేళ్ళను జ్ఞాపకం చేసికొని స్తుతించడమే గాక కృతజ్ఞతా వైఖరిని/స్వభావాన్ని కలిగి ఉండాలి. ఇది ప్రతి విశ్వాసి కలిగి ఉండాల్సిన అత్యంత విలక్షణమైన వైఖరి. ఇది మనం అప్పుడప్పుడూ పెట్టుకొనే కృతజ్ఞతా కూడిక లాంటిది కాదు, విదేశాల్లో చేసుకొనే 'థ్యాంక్స్‌గివింగ్

నేను బైబిల్ కాలేజ్‌లో ఉన్నప్పుడు నా మెంటర్/ప్రొఫెసర్ బార్బీ విండ్సర్‌కి కొన్ని విషయాల్లో సహాయం చేసేదాన్ని. సహాయం చేసిన ప్రతిసారి ఒక థ్యాంక్యూ కార్డ్ తయారుచేసి దానితో ఒక పువ్వు గానీ, చాక్లెట్ గానీ, కప్ కేక్ గాని కలిపి మా డోర్ ముందు పెట్టి వెళ్ళేది. ఆమె అలా చెయ్యాల్సిన అవసరం లేదు. ఎంత చిన్న వారైనా, ఎంత చిన్న సహాయమైనా తేలిగ్గా తీసుకోకూడదు. ఈ మాటలు చదువుతున్నప్పుడు మనం కృతజ్ఞతలు చెప్పకుండా ఎవరినైనా మర్చిపోయామా? ఆలోచించుకొందాం.

దే' లాంటిది కూడా కాదు. మనం జీవితాంతం కలిగి ఉండాల్సిన సద్గుణం. కృతజ్ఞత ఉద్దేశపూర్వకంగా, ఎంచుకొని చేయాల్సిందే కానీ అది సహజంగా రాదు. అది మన వైఖరి, మన జీవనశైలి కావాలి.

## దేవునిపట్ల కృతజ్ఞత ఎందుకు అవసరం?

బైబిల్లో చాలా చోట్ల దేవుని పట్ల కృతజ్ఞత కలిగి ఉండాలని ఆజ్ఞాపించినట్లు చూస్తాం. కృతజ్ఞతకు దేవుడే మాదిరి. "మీరు చేసిన కార్యమును....చూపిన ప్రేమను మరచుటకు దేవుడు అన్యాయస్థుడు కాదు" (హెబ్రీ 6:10). కృతజ్ఞత చూపించకపోతే అది పాపంగా ఎంచాడాయన. దేవునిపట్ల కృతజ్ఞతకలిగి ఉండడం నేర్చుకొనేలా ఇతరుల ప్రయోజనం కోసం బహిరంగంగా యేసు క్రీస్తు కూడా దేవునికి కృతజ్ఞతలు తెలిపారు (యోహాను11:41-42, లూకా 24:30, మత్తయి 14:19, 15:36).

ఆయన ఏమై ఉన్నాడో, ఆయన గుణలక్షణాలను గుర్తుచేసికొని వాటికొరకు కృతజ్ఞతలు చెల్లించాలి. ఆయన పరిశుద్ధుడు, ప్రేమామయుడు, సార్వభౌముడు, న్యాయవంతుడు, మంచివాడు, దయగలవాడు, కరుణా సంపన్నుడు... ఇంకా ఎన్నో. కీర్తనాకారులు దేవునికి స్తుతిగానం చేయమని ప్రోత్సహించారు.

దేవుడు చేసిన మేళ్ళలో, ఆశీర్వాదాల్లో అత్యున్నతమైనది రక్షణ. యేసుక్రీస్తు చేసిన సిలువ బలియాగం ద్వారా పాపపు దాస్యం నుండి, ఉగ్రతనుండి విడిపించి, మన జీవిత విలువను పెంచి, ఆయన రాజ్య వారసులుగా మనల్ని చేసినందుకు కృతజ్ఞత చెల్లించకుండా ఎలా ఉండగలం? (కొలస్సీ 1:13; 2 కొరింథీ 9:15). ఆ రక్షణలో కొనసాగడానికి పరిశుద్ధాత్మ దేవుడు సహాయం చేస్తూనే ఉన్నారు (ఫిలిప్పీ 2:13).

కరోనా కాలంలో మనకి జీవితం/ప్రాణం విలువ బాగా అర్థమైయ్యింది. దేవుడిచ్చిన ఈ అమూల్యమైన జీవితం, ఆయుష్షు, మనలను తనవైపుకు ఆకర్షించుకున్న విధానం, సహవాసంలో మనమెంటార్స్, దైవజనులు, వారిద్వారా ఇచ్చిన ఆత్మీయ మేళ్ళు, ఆరోగ్యం, విద్య, టీచర్స్, ఉద్యోగాలు, కుటుంబాలు, సంబంధాలు, ఆర్థిక సహాయం, ఉచితంగా ఇచ్చిన అనేక వనరుల కొరకు,...ఇలా చెప్పుకొంటూ పోతే ఎన్నో.. ఈ లిస్ట్‌కి అంతేలేదు. ఇవన్నీ మన సొంత తెలివితోనో, కష్టంతోనో సంపాదించుకొన్నవి కావు. దేవుడు దయచేసినవే. అందుకే ఆయనకు కృతజ్ఞతలు చెల్లించాలి. క్రమం తప్పకుండా, నిరంతరం దేవునికి కృతజ్ఞతలు చెప్పడం మన జీవితం పట్ల ఆయన చిత్తం (1 థెస్స 5:18). ఒక అబ్బాయి బ్రష్ చేస్తున్నప్పుడు ఈ వచనం గుర్తుకొచ్చి, బ్రష్, టూత్ పేస్ట్ కోసం, ఫుడ్‌ని ఆనందంగా తినడానికి దేవుడిచ్చిన దంతాలను బట్టి స్తుతించాడట. మనం భోజనం చేస్తున్నప్పుడు భోజనం కోసం, వండినవారికోసం కృతజ్ఞతలు చెప్తాం కానీ పండించిన రైతుల కోసం కూడా చెప్పొచ్చు.

దావీదు తన జీవితంలో కృతజ్ఞతలు చెల్లించడం ఒక అలవాటుగా చేసుకొన్నాడు (కీర్తనలు 103). దానియేలు తనపై అసూయపడిన వారు కుట్ర పన్నుతున్నప్పుడు యథావిధిగా ప్రార్థించాడు, కృతజ్ఞతలు చెల్లించాడు. "దేవుని ప్రేమించువారికి...సమస్తం మేలుకొరకే జరుగుచున్నాయని" (రోమా 8:28). పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా అవి దేవుని ఆధీనంలోనే ఉంటాయని, సార్వభౌమాధికారంతో వాటిని మనజీవితాల్లో అనుమతించాడని మనం నమ్మితే, కృతజ్ఞతతో జీవించవచ్చు. పండంటి పాపాయి కావాలంటే డెలివరీ పెయిన్స్/సిజేరియన్ కోసం కృతజ్ఞతలు చెప్పాల్సిందే.

## దేవునిపట్ల కృతజ్ఞత ఎలా చూపించాలి?

ఆయన పట్ల కృతజ్ఞతని చూపించడమంటే ఆయనకి ఇష్టంగా జీవించడం, ఆయనను ప్రేమించడం,


ఆయనతో సమయం గడపడం (మౌనధ్యాన సమయం, ప్రార్థన), పాటలతో స్తుతించడం, ఆయనను అనుసరించడం, ఆయన ఇచ్చిన ఆజ్ఞలకు విధేయత చూపించడం, ఆయన ఆచరించమన్న ప్రభుసంస్కారము ఆచరించడం, ఆయన ఇచ్చిన తలాంతులు వాడడం, గివింగ్, ఆయన అప్పగించిన సేవ చేయడం, ఇతరులకు సహాయం చేయడం, వారిని ప్రేమించడం ద్వారా మనం చూపించవచ్చు. ఆదివారం సంఘంలో ఆరాధించడం మాత్రమే కాదు, వ్యక్తిగత ఆరాధన కూడా కలిగి ఉండాలి.

నేను బైబిల్ కాలేజ్‌లో ఉన్నప్పుడు నా మెంటర్/ప్రొఫెసర్ బార్బీ విండ్సర్‌కి కొన్ని విషయాల్లో సహాయం చేసేదాన్ని. సహాయం చేసిన ప్రతిసారి ఒక థ్యాంక్యూ కార్డ్ తయారుచేసి దానితో ఒక పువ్వు గానీ, చాక్లెట్ గానీ, కప్ కేక్ గాని కలిపి మా డోర్ ముందు పెట్టి వెళ్ళేది. ఆమె అలా చెయ్యాల్సిన అవసరం లేదు. ఎంత చిన్న వారైనా, ఎంత చిన్న సహాయమైనా తేలిగ్గా తీసుకోకూడదు. ఈ మాటలు చదువుతున్నప్పుడు మనం కృతజ్ఞతలు చెప్పకుండా ఎవరినైనా మర్చిపోయామా? ఆలోచించుకొందాం. పౌలు పరిచర్యలో సహాయం చేసిన వారిని అభినందిస్తూ, వారి ద్వారా దేవుడు ఎలాంటి పరిచర్య చేశాడో వారిని బట్టి తనెంతగా దేవునికి కృతజ్ఞతకలిగి ఉన్నాడో తెలుపుతూ తన పత్రికల్లో రాశాడు (రోమా 16). మనుష్యులు చేసిన సహాయానికే మనం అలా ప్రతిస్పందిస్తే మరి దేవుడు చేసిన లెక్కలేనన్ని మేళ్ళకి మనం ఎలా ప్రతిస్పందించాలి? ఎంత చేసినా ఆయనకు ఋణస్తులమే కదా!

## కృతజ్ఞతారాహిత్యం

దేవుడు చేసిన మేళ్ళని చాలా తేలిగ్గా తీసుకొని, ఆయనకు కృతజ్ఞతలు చెప్పడంలో విఫలమవ్వడమే కృతజ్ఞతారాహిత్యం. దేవుడు దీన్ని పాపంగా యెంచాడు.

దేవుడు కృతజ్ఞతారాహిత్యాన్ని ఎంత సీరియస్‌గా తీసుకొంటాడన్నది లూకా 17లో చూస్తాం. యేసు ప్రభువు 10 మంది కుష్ఠరోగుల్ని స్వస్థపరచినప్పుడు ఒక్కడు మాత్రమే తిరిగి వచ్చి గొప్ప శబ్దముతో దేవుని మహిమ పరచి ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లిస్తూ ఆయన పాదముల యొద్ద సాగిలపడ్డాడు. ఆయన మిగిలిన 9 మంది రాలేదని గమనించి "ఈ అన్యుడు తప్ప దేవుని మహిమ పరచుటకు తిరిగి



వచ్చిన వాడెవడును అగపడలేదా?, లేచిపొమ్ము, నీ విశ్వాసము నిన్ను స్వస్థపరిచింది" అంటాడు. మిగిలిన 9 మంది చెడ్డవారనికాదు, వారు కూడా స్వస్థపడ్డారు, ఆయనమాటకు విధేయత చూపి యాజకులదగ్గరకు వెళ్ళి ఉంటారు. కానీ వారు ఆయనచేసిన మేలును మర్చిపోయారు, తేలిగ్గా తీసుకొని ఆయనకు చెందాల్సిన కృతజ్ఞతను చెల్లించలేకపోయారు. గనుక కృతజ్ఞతను మన జీవితంలో గుర్తించడం, దానిని వ్యక్తం చేయడం చాలా ప్రాముఖ్యం. విశ్వాసం లేకుండా కృతజ్ఞత కలిగి జీవించడం అసాధ్యం.

దేవునిపట్ల ఇశ్రాయేలు ప్రజల ప్రతిస్పందన ఎలావుందో బైబిల్ గ్రంథంలో చాలా చోట్లచూస్తాం (సంఖ్యా 21, కీర్తనలు 78, 1 కొరింథీ 10:1-13). దేవుడు చేసిన వాగ్దానాలను నమ్మలేక పోవడం, అసహనం ప్రదర్శించడం, దేవునిని వదిలి విగ్రహాలను ఆరాధించడం, తమకు దేవుడిచ్చిన వాటితో తృప్తికలిగి ఉండలేకపోవడం, ప్రతి విషయాన్ని విమర్శనాత్మకంగా చూడడం, స్వార్థపూరితంగా ఆలోచించడం,అనేక విషయాల గురించి సణగడం చూస్తాం (1 కొరింథీ 10:1-13). సణగడం అన్నది కృతజ్ఞతకి వ్యతిరేకంగా చేసేది. వీటన్నిటి ద్వారా దేవునికి అవిధేయత చూపించి తిరుగుబాటు చేయడం ద్వారా, దేవుడు వారిని అన్య రాజుల చేతికి అప్పగించడం, అనేక విధాలుగా వారిని క్రమశిక్షణ చేయడం చూడగలం. కృతజ్ఞత, ద్వేషం కలిసి ఉండలేవు. ద్వేషం మన మనసులో ఉంటే మనం కృతజ్ఞతాభావం కలిగి ఉండలేము.

లవొదికయ సంఘం కూడా ఈ జాబితాలో ఉన్నట్టు మనం ప్రకటన 3:17లో చూస్తాం. దేవుడు వారితో "నేను ధనవంతుణ్ణి, నాకు ఏమీ అవసరం లేదు అని నీవు చెప్తున్నావు కానీ నీవు




దౌర్భాగ్యుడవును, దిక్కులేనివాడవును, దరిద్రుడవును, గ్రుడ్డివాడవును, దిగంబరుడవునై యున్నావు" అంటాడు. స్వయంకేంద్రిత జీవితం కలిగిన వ్యక్తులు మాత్రమే ఇలాంటి వైఖరి కలిగి, తమ ఆస్తి, డిగ్రీలు, పదవులు, అధికారం... ఇవన్నీ నావల్లే, నా సొంత కష్టంతో, నా నైపుణ్యంతో, జ్ఞానంతో సంపాదించుకొన్నాను కాబట్టి నేనెవరికీ కృతజ్ఞతలు చెప్పాల్సిన అవసరం లేదనుకొంటారు. అవి దేవుడు చేసిన కార్యాలని గుర్తించకపోగా తమ వల్లే అవి జరిగాయన్న గర్వం కూడా ఉంటుంది. ఇలాంటి వారి గురించి పౌలు "అంత్య దినాల్లో మనుష్యులు కృతజ్ఞత లేని వారుగా మారతారని హెచ్చరిస్తున్నాడు (2 తిమోతి 3:1,2). మన చుట్టూ ఉన్న కృతజ్ఞతారాహిత్యం మనలో పొందిన మేలును తొక్కివేసే ప్రమాదం ఉంది. ఈ కృతజ్ఞతారాహిత్యాన్ని సాతాను ఒక సాధనంగా వాడుకొని దేవునికి వ్యతిరేకంగా మనల్ని మార్చడానికి ప్రయత్నిస్తున్నాడు, ఏదెను తోటలో అదే జరిగింది (ఆదికాండం 3వ అధ్యాయం).

## కృతజ్ఞతతో కూడిన జీవితం వల్ల వచ్చే ఆశీర్వాదాలు

కృతజ్ఞత అనేది మనల్ని దేవునికి ఎంతో సమీపంగా చేస్తుంది. ఆయన సన్నిధిని అనుభవించినవారమవుతాం, మనపట్ల ఆయన శ్రద్ధని అనుభవపూర్వకంగా చూస్తాం, ఆయనతో మనసంబంధం బలపడుతుంది. ప్రతివిషయం కొరకు ఆయనను ఎల్లప్పుడూ మహిమపరుస్తాం. పొందుకున్న ఆశీర్వాదాన్ని బట్టి కాక ఆయన గొప్పతనాన్ని, మంచితనాన్ని బట్టి ఆయనను ఘనపరుస్తూ, ఆయనకు లోబడి ఉండడానికి ఇష్టపడతాం.

- కృతజ్ఞత మనల్ని చింతనుండి, ఒత్తిడి నుండి విడిపించి, శాంతినిస్తుంది (ఫిలిప్పీ 4:6-7). దానివలన మనం ఆరోగ్యంగా ఉంటాం, మనలో ఉత్పాదక సామర్థ్యం పెరుగుతుంది.
- కృతజ్ఞత అన్నది మన మీద కంటే దేవుని మీద మన దృష్టి ఉంచేలా తోడ్పడుతుంది.
- కృతజ్ఞత దేవునిపై ఓర్పు, నమ్మకాన్ని పెంపొందిస్తుంది.
- కృతజ్ఞత అనేది సంక్రమించేది, దాని ద్వారా మన చుట్టూ ఉన్నవారుకూడా కృతజ్ఞతకలిగి జీవించటం నేర్చుకొంటారు.
- కృతజ్ఞత మనం ఎంతగా ఆశీర్వదించబడ్డామో గుర్తుచేస్తుంది. కోరికలకంటే పొందిన ఆశీర్వాదాలపై మనం దృష్టి పెడితే సంతోషంగా ఉంటాము.

"ఆనందం మిమ్మల్ని కృతజ్ఞత కలిగి ఉండేలా చేయదు కానీ చేసిన మేలును గుర్తుచేసుకోవడం మిమ్మల్ని కృతజ్ఞత కలిగి ఉండేలా చేస్తుంది. ఆనందం కృతజ్ఞతను అనుసరిస్తుంది" అని ఛార్లెస్ స్విండాల్ అంటాడు.

"కృతజ్ఞతానుభూతి చెంది దానిని వ్యక్తపరచక పోవడం బహుమతిని సిద్ధంచేసి దానిని ఇవ్వకపోవడం లాంటిది." అని విలియం ఆర్థర్ డబ్ల్యు అంటాడు. గనుక ఈ నూతనసంవత్సరంలోకి అడుగుపెడుతున్న మనం ఒకసారి ఆగి, దేవుడు ఇంతవరకూ చేసిన మేళ్ళన్నింటిని గుర్తుచేసికొని, హృదయపూర్వకంగా ఆయనను స్తుతిద్దాం, ఇతరులతో పంచుకొందాం. అంతేకాదు ఆ కృతజ్ఞత కలిగిన జీవితాన్ని మన స్వభావంగా చేసుకొందాం, మన జీవనశైలిగా మార్చుకొందాం, అనేకులకు ఆశీర్వాదకరంగా జీవిద్దాం.

– ఆర్. సుమ శ్రీనివాస్, స్టాఫ్, గుంటూరు





# జోనాథాన్ ఎడ్వర్డ్స్ తీర్మానాలు

జోనాథాన్ ఎడ్వర్డ్స్ పేరు క్రైస్తవ వేదాంత ప్రపంచంలో తెలియనివారు బహుశా ఉండరేమో. అమెరికా గడ్డ మీద పుట్టిన గొప్ప తాత్వికవేత్తగా, వేదాంతిగా అతన్ని పరిగణిస్తారు. ఈయన గొప్ప రచయిత, సువార్తీకుడు, పాస్టర్, మిషనరీ. అతను రాసిన 'రెలిజియస్ అఫెక్షన్స్, ఫ్రీడమ్ ఆఫ్ ద విల్, ది నేచర్ ఆఫ్ ద ట్రూ విర్ట్యూ' వంటి పుస్తకాలు క్రైస్తవసాహిత్యంలో కళాఖండాలుగా నిలిచాయి. 18వ శతాబ్దంలో నిజమైన ఉజ్జీవాన్ని గూర్చిన ప్రశ్నలు రేకెత్తినప్పుడు నిజమైన ఉజ్జీవానికుండే లక్షణాలను లేఖనాల నుండి చూపిస్తూ ఉజ్జీవం విస్తరించడంలో ప్రముఖ పాత్రను పోషించాడు. అందుకే ఈయనను ఉజ్జీవ వేదాంతి అని కూడా పిలుస్తారు. ప్రపంచ ప్రేషిత ఉద్యమ విస్తరణలో కీలక పాత్ర పోషించిన డేవిడ్ బ్రైనార్డ్ యొక్క డైరీని, జీవిత చరిత్రను సంకలనం చేసింది కూడా ఈయనే. ఆ డైరీని చదివి అనేకమంది యువకులు ప్రేరేపించబడి మిషనరీస్‌గా వెళ్ళడానికి తమ జీవితాలను దేవునికి అప్పగించుకొన్నారు. అలా వచ్చిన వారిలో విలియం కేరీ కూడా ఒకరు. జోనాథాన్ ఎడ్వర్డ్స్ చెప్పిన 'పరిశుద్ధుడైన దేవుని చేతిలో పాపులు' అనే ప్రసంగం సంఘ చరిత్రలో ప్రభావవంతమైన సౌవార్తిక సందేశాలలో ఒకటిగా పరిగణిస్తారు క్రైస్తవ వేదాంతులు. ఈయన క్రైస్తవ సంఘ చరిత్రపై, క్రైస్తవ సాహిత్యముపై చూపిన ప్రభావం వెల కట్టలేనిది. అందుకే 'క్రైస్తవ వేదాంతంలో ఎవరెస్ట్ శిఖరం లాంటివాడని' మార్టిన్ లాయిడ్ జోన్స్ అభిప్రాయపడ్డాడు.

జోనాథాన్ ఎడ్వర్డ్స్ తన 17వ సంవత్సరంలో అంటే 1721వ సంవత్సరంలో రక్షణ పొందాడు. తాను ఒక కళాశాలలో చదవడానికి వెళ్ళాడు. తాను యేసుప్రభువును నమ్ముకొన్న ఒక సంవత్సరం తర్వాత, తన క్రైస్తవ విశ్వాసానికి దిశానిర్దేశం అవసరమని, కళాశాలలో తనకు లభించిన కొత్త స్వేచ్ఛను సరిగా వాడుకోవాలంటే తనకు ఆధ్యాత్మిక క్రమశిక్షణ అవసరమని గ్రహించి, తాను క్రైస్తవ జీవితములో ఎదగడానికి, ఆధ్యాత్మిక విషయాల నుండి తన దృష్టి మరలకుండా ఉండడానికి 70 తీర్మానాలు తీసుకొన్నాడు. డిసెంబర్ 18, 1722 వ సంవత్సరములో మొదటి తీర్మానమును రాసుకొన్నాడు. మొదటి 21 తీర్మానాలు ఒకే పెన్నుతో ఒకే సమయంలో రాశాడు. తన చివరి తీర్మానాన్ని 17 ఆగస్ట్ 1723 వ తేదీన రాసుకొన్నాడు. ఈ 70 తీర్మానాల్లో కొన్నిటిని చూద్దాం.

### మొదటి తీర్మానం

*"దేవునికి అత్యున్నత మహిమను, నాకు సంతృప్తిని, క్షేమాన్ని ఇచ్చేదాన్నిచేసే విషయంలో నైపుణ్యత సాధించడానికి ఎంత సమయం పట్టినా గానీ నేను జీవించినంత కాలము దానిని చేయాలని తీర్మానించుకొన్నాను. అలాగే మానవాళికి మంచి చేయడానికి నాకున్న పిలుపును ఎన్ని ఆటంకాలు ఎదురైనా గానీ నేను చెయ్యగలిగినంత మేర నెరవేర్చాలని తీర్మానం చేసుకొన్నాను".*



ప్రతిరోజూ 13 గంటలు ప్రార్థనకు, వాక్యాన్ని ధ్యానించడానికి, అధ్యయనం చేయడానికి కేటాయించేవాడు. లేఖనాలను ధ్యానించడమనేది అతడు రక్షణపొందిన ప్రారంభ దినాల నుండే అలవాటు. చాలాసార్లు అతను వాక్యాన్ని ధ్యానం చేస్తూ భోజనం చేయడం కూడా మరచిపోయేవాడు. ఏదైనా లేఖన భాగం అర్థం కాకపోతే దానిని అర్థం చేసుకోవడానికి ఎంత సమయమైనా వెచ్చించేవాడు.

'తన భక్తి జీవితంలోనైనా, స్టడీస్‌లోనైనా, సాంఘీక జీవితం లోనైనా, బహిరంగ పరిచర్యను నిర్వర్తించే విషయంలోనైనా, తన రచనలను ప్రచురించే విషయంలోనైనా దేవుని యొక్క మహిమే అతని అత్యున్నతమైన లక్ష్యమని' సెరినో ఇ డ్వైట్ రాస్తాడు. మిగతావన్నీ తక్కువ ప్రాధాన్యతలు, అతనిపై ఎటువంటి ప్రభావం చూపించనట్లుగా కనిపిస్తాయి. దేవునికి మహిమ రావడం ప్రాధాన్యతగా పెట్టుకోవడమే తనకు క్షేమం, ఆనందమని ధృఢంగా నమ్మాడు ఎడ్వర్డ్స్. ఒకవేళ ఇది నెరవేరితే అతని కోరికలన్నీ సంతృప్తి చెందుతాయి. ఎడ్వర్డ్స్ దేవుని యొక్క మహిమను ఎంత ఎక్కువగా వెదికాడో, కోరుకొన్నాడో అంత ఎక్కువగా లోతైన ఆనందాన్ని పొందాడు. దేవుడే తన యొక్క గొప్ప సంతోషంగా ఆయన్ను హత్తుకొన్నాడు.

### ఈ తీర్మానంలో రెండవ భాగము

నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమించాలనే దేవుని యొక్క ఆజ్ఞను ఆచరణలో చూపించాలని తీర్మానము చేసుకొన్నాడు. దేవుని మహిమ మీద దృష్టి కేంద్రీకరిస్తే అది అంతిమంగా ప్రజల యొక్క మంచి కొరకు నడిపిస్తుందని అతనికి తెలుసు. పొరుగువారిని ప్రేమించడమనేది దేవునికి మహిమను తీసుకొని వచ్చే ఒక ప్రాముఖ్యమైన మార్గము. దాని నుండి అతను ఎటువంటి గౌరవం పొందాలనే ఆలోచన లేకుండా నిస్వార్థంగా ఇతరులకు సేవ చేయాలని తీర్మానించుకొన్నాడు. అలాంటి నిస్వార్థమైన జీవితం దేవుని మహిమపరచే సాధనమని అతని విశ్వాసము.

### రెండవ తీర్మానం

ఈ రెండవ తీర్మానం మొదటి తీర్మానాన్ని అనుసరించి ఉంటుంది.

*"మొదటి తీర్మానాన్ని వాస్తవికతలోనికి తీసుకొని రావడానికి కొత్త ఆవిష్కరణలు, మార్గాలు వెదకడం కోసం నిరంతరం శ్రమించాలని నేను తీర్మానించుకొన్నాను".*

ఇక్కడ ఎడ్వర్డ్స్ మనసులో ఉన్నదేంటి? సామూహిక ప్రార్థనను బలపరచే కొత్త మార్గం కావొచ్చు, తన వ్యక్తిగతమైన భక్తిని నిర్మించుకొనే కొత్త విధానం కావొచ్చు, దేవునితో ఒంటరిగా గడిపే కొత్త ప్రదేశం కావొచ్చు, తాను చేయాల్సిన కొత్త పరిచర్య కూడా కావొచ్చు. రిఫార్మేషన్ యొక్క ఒక నినాదమేంటంటే ఎప్పుడూ రిఫామ్ అవుతూ ఉండడం. ఈ తీర్మానం ద్వారా ఎడ్వర్డ్స్ దేవుని మహిమ కొరకు ఎల్లప్పుడూ తన జీవితాన్ని పునరుద్ధరించుకోవాలని నిర్ణయించుకొన్నాడు.

### ఐదవ తీర్మానం

*"సమయంలో ఒక్క క్షణాన్ని కూడా వృధాగా పోగొట్టుకోకూడదని తీర్మానం చేసుకొన్నాను. సమయాన్ని సాధ్యమైనంతవరకు ఎక్కువ ప్రయోజనకరమైనదిగా చేసుకోవాలని నేను తీర్మానించుకొన్నాను."*

"పాపాన్ని చంపడానికి మనము ఉపయోగించే సమయమే సరిగా వాడుకొన్న సమయం" అని ఎడ్వర్డ్స్ అభిప్రాయబడ్డాడు. సమయాన్ని శ్రేష్టముగా ఉపయోగించుకోవడానికి ఎంతగానో ప్రయాసపడ్డాడు. దేవుని చిత్త ప్రకారం తన యొక్క సమయాన్ని ఎంతో ప్రణాళికబద్ధంగా, ప్రభావవంతంగా ఉపయోగించుకోవాలని, సమయాన్ని ప్రయోజనకరంగా వాడుకొనే విషయమై చాలా శ్రద్ధను చూపించాడు.

### ఆరవ తీర్మానం

*"నేను జీవించే కాలమంతా నా పూర్ణమైన శక్తితో క్రీస్తు కొరకు జీవించాలని నేను తీర్మానించుకొన్నాను"*

ఈ ఆరవ తీర్మానంలో తాను క్రైస్తవ జీవితాన్ని ఎప్పుడూ అర్థ హృదయంతో జీవించనని, దైవ భక్తిలో ఉన్నతంగా జీవించడానికి ముందుకు సాగుతానని నిర్ణయము తీసుకొన్నాడు. తాను జీవించి ఉన్నంత కాలం ప్రతి ప్రయత్నానికి తన శక్తియుక్తులన్నీ ధారపోయాలని నిర్ణయించుకొన్నాడు. క్రీస్తు కొరకు తాను చేపట్టిన ప్రతి పనిలోనూ సంపూర్ణంగా నిమగ్నం కావాలని ఉద్దేశించాడు. ఏ క్రైస్తవుడు కూడా సాధించలేనంత రీతిలో దేవునికి సమీపముగా ఉండాలని, ఆధ్యాత్మిక సంపూర్ణతలోనికి తాను నడిపింపబడాలనే ఆశ కలిగి ఉన్నాడు. 63వ తీర్మానంలో "తన తరంలో అత్యంత సంపూర్ణ క్రైస్తవుడిగా ఉండడానికి ప్రయత్నిస్తాను అని ప్రతిజ్ఞ చేసుకొన్నాడు.

## ఏడవ తీర్మానం

*"నా జీవిత చివరి ఘడియలో నేను ఏమి చెయ్యడానికైతే భయపడతానో అటువంటిది ఎప్పుడూ చేయకూడదని నేను తీర్మానించుకొన్నాను."*

తన జీవితంలో పాపాన్ని చంపడానికి ప్రాథమికంగా ఈ తీర్మానం ఉద్దేశించడమైంది.

నేను జీవించడానికి ఒక గంట మాత్రమే ఉంటే, ఏ పనులకు దూరంగా ఉండాలని అనుకొంటాడో, తన క్రైస్తవ నడకలో ప్రతి సమయంలో కూడా వాటికి దూరంగా ఉండాలని నిర్ణయించుకొన్నాడు. ఈ దృక్పథం అతని పాపపు ఆలోచనలు, కార్యకలాపాలు మాటలను నియంత్రిస్తుంది. అతను తన చివరి గంటలో ఉన్నట్లు జీవించడం పాపపు విషయాలను దూరంగా ఉంచడంలో అతనికి సహాయపడింది.

## ఎనిమిదవ తీర్మానం

*"దేవుని ప్రేమ మీద నాకు చిన్న సందేహాన్ని కలిగించే విషయమేదైనా నాలో ఉందేమో నిశితంగా పరిశీలించాలని, నా శక్తులన్నిటిని దానికి విరోధంగా వాడాలని తీర్మానించుకొన్నాను."*

## పదవ తీర్మానం

*"నేను బాధను అనుభవిస్తున్నప్పుడు, హతసాక్షుల యొక్క బాధను, నరకం యొక్క వేదన గూర్చి ఆలోచించాలని తీర్మానించుకొన్నాను."*

నేను శారీరక వేదనను అనుభవించినప్పుడల్లా, క్రీస్తు కొరకు బాధపడేవారిని నేను గుర్తు చేసుకొంటూ, శాశ్వతమైన నరక శిక్ష నుండి నన్ను రక్షించిన

> **"పాపాన్ని చంపడానికి మనము ఉపయోగించే సమయమే సరిగా వాడుకొన్న సమయం."**

దేవుని గొప్ప కృపను జ్ఞాపకం చేసుకొంటాను. క్రీస్తు యొక్క అవసరత కలిగిన వారిపట్ల నా యొక్క కనికరాన్ని పెంపొందించుకోవడానికి, నమ్మనివారికి సువార్త సందేశాన్ని పంచుకొనేందుకు నన్ను నేను ప్రేరేపించుకోవడానికి ఈ తీర్మానం చేస్తున్నాను.

## పద్నాల్గవ తీర్మానం

*"ప్రతీకారంతో ఎప్పుడూ ఏమీ చేయకూడదని నేను తీర్మానం చేసుకొన్నాను".*

తాను యువకుడిగా ఉన్నప్పుడు ఏదైనా రైట్ అని భావించినప్పుడు తాను వాదించేవాడినని ఎడ్వర్డ్స్ ఒప్పుకొన్నాడు. తన జీవితంలో బాధించే వ్యక్తుల పట్ల తన ప్రతిచర్యలను నియంత్రించుకోవాలని గ్రహించాడు. తన యొక్క అసహనం తన భావోద్వేగ స్థితిని ప్రభావితం చేయడానికి అనుమతివ్వకూడదని నిశ్చయించుకొన్నాడు. ఇతరులు అతనిని రెచ్చగొట్టినప్పుడు, అతని వాదన సరైనదని విశ్వసించినప్పుడు కూడా, పగ, ప్రతీకారాలు కలిగి ఉండకూడదని నిర్ణయించుకొన్నాడు. దేవుని కృప ద్వారా మాత్రమే అతను తనను తాను నిగ్రహించుకోగలిగాడు.

## పదహారవ తీర్మానం

*"నిజంగా మంచి జరుగుతుంది అంటే తప్పించి ఎవరి గురించి చెడుగా మాట్లాడకూడదని తీర్మానించుకొన్నాను"*

ఈ తీర్మానం ఎడ్వర్డ్స్‌కు చాలా ముఖ్యమైనది. ఇతరులను అగౌరవపరిచే మాటలు మాట్లాడకుండా తనను తాను నియంత్రించుకొనే ప్రయత్నంలో భాగమే ఈ తీర్మానం. ఎడ్వర్డ్స్ మరొక వ్యక్తి "తప్పులకు" తాను బలి అయినప్పుడల్లా ఆ వ్యక్తితో మాట్లాడడానికి ముందు కొంత సమయం వేచి ఉండాలని నిర్ణయించుకొన్నాడు. తన బాధకు సంబంధించి తన భావోద్వేగాల తీవ్రత తగ్గిన తర్వాత అవతలి వ్యక్తి యొక్క తప్పును ఎత్తి చూపాలని కోరుకొన్నాడు, ఎందుకంటే ఆవేశంలో ఎలాపడితే అలా మాట్లాడకుండా ఈ నిర్ణయం తీసుకొన్నాడు.

## ఇరవై ఎనిమిదవ తీర్మానం

*"నేను లేఖన జ్ఞానంలో ఎదుగుతున్నానని నాకు స్పష్టంగా అర్థమయ్యేవరకు లేఖనాలను స్థిరంగా, నిరంతరం అధ్యయనం చేయాలని తీర్మానించుకొన్నాను".*

ఎడ్వర్డ్స్ యొక్క బావ, ఎడ్వర్డ్స్ జీవితాన్ని రచించిన శామ్యూల్ హాప్కిన్స్ ఎడ్వర్డ్స్ గూర్చి చెబుతూ "ఇతను ఇతర పుస్తకాలన్నిటి కంటే, ఇతర భక్తుల కంటే ఎక్కువగా బైబిల్‌ని అధ్యయనం చేశాడు" అని రాశాడు.

ఎడ్వర్డ్స్ తాను లేఖనాల్లో కనుగొన్న శక్తిని గూర్చి చెబుతూ "నేను లేఖనాలను ఎక్కువగా చదివిన ఆ సమయాల్లో, మిగిలిన అన్ని సమయాల కన్నా చాలా ఉల్లాసంగా, ఉత్తమమైన స్థితిలో ఉండేవాడిని" అని తన డైరీలో రాసుకున్నాడు.

ప్రతిరోజూ 13 గంటలు ప్రార్థనకు, వాక్యాన్ని ధ్యానించడానికి, అధ్యయనం చేయడానికి కేటాయించేవాడు. లేఖనాలను ధ్యానించడమనేది అతడు రక్షణపొందిన ప్రారంభ దినాలనుండే అలవాటు. చాలాసార్లు అతను వాక్యాన్ని ధ్యానం చేస్తూ భోజనం చేయడం కూడా మరచిపోయేవాడు. ఏదైనా లేఖన భాగం అర్థం కాకపోతే దానిని అర్థం చేసుకోవడానికి ఎంత సమయమైనా వెచ్చించేవాడు.


## యాభైఆరవ తీర్మానం

*"నేను విజయం సాధించినా, విఫలమైనా నా అపవిత్రతతో పోరాటాన్ని ఆపను లేదా విడిచిపెట్టనని తీర్మానించుకొన్నాను."*

ఎన్ని అపజయాలు, నిరుత్సాహాలు వచ్చినప్పటికి పాపముతో పోరాడే విషయంలో తన ప్రయత్నాలను విరమించకూడదని నిర్ణయించుకొన్నాడు. తన జీవితంలో తాను గుర్తించిన పాపముతో పోరాడడానికి తనను తాను సమర్పించుకొన్నాడు. తనలో నివశించే పాపాన్ని జయించడానికి తన శక్తి సరిపోదని, దేవుని శక్తి ద్వారా, పరిశుద్ధాత్మ దేవుని యొక్క బలపరచే పని ద్వారా మాత్రమే తన యొక్క అంతరంగ పాపాన్ని తాను చంపగలనని గ్రహించాడు.

## ముగింపు

జోనాథాన్ ఎడ్వర్డ్స్ ఈ 70 తీర్మానాలు తీసుకొన్నప్పటికీ, వాటిని నెరవేర్చడానికి తన బలము, 



జ్ఞానము సరిపోదని ఒప్పుకొన్నాడు. ఈ "తీర్మానాలను" రాసేటప్పుడు దేవుడు మాత్రమే పవిత్రీకరణకు కర్త అనే గ్రహింపు కలిగి రాశాడు. దేవుని వాక్యానికి విధేయత చూపి, పవిత్రతను వెంటాడాల్సిన బాధ్యత తనకుందని తెలిసినప్పటికీ, తన యొక్క సంపూర్ణ సంకల్ప శక్తితో తాను అలా చేయలేనని గ్రహించాడు. అతను దేవుని దయ ద్వారా, నాలో నివశించే పరిశుద్ధాత్మ దేవుడు బలపరచడం ద్వారా మాత్రమే వీటిని చేయగలననే గ్రహింపును కలిగియున్నాడు. దేవుని సహాయం లేకుండా నేను ఏమీ చేయలేను అనే స్పృహతో, క్రీస్తు కొరకు, ఈ తీర్మానాలను ఆయన చిత్తానికి ఆమోదయోగ్యమైనంత వరకు వాటిని నెరవేర్చేటట్లు చేయమని ఆయన కృప కొరకు వేడుకొంటున్నాను అని తన డైరీలో రాసుకొన్నాడు. దేవునికి ఇష్టమైనదేదైనా చేయగల లేదా తన స్వంత ఆధ్యాత్మిక ఎదుగుదలను ఉత్పత్తి చేసే సామర్థ్యం లేదని చెప్పాడు. దేవుని ఆత్మ సహాయం లేకుండా ఎంత దయనీయమైన దౌర్భాగ్యుడను, నేను ఎంత బలహీనంగా ఉన్నాను! అనే విషయాన్ని గుర్తించాడు.

ఎడ్వర్డ్స్ తన జీవిత కాలంలో ఈ తీర్మానాలన్నిటినీ సంపూర్ణంగా నెరవేర్చానని చెప్పలేదు గానీ అనేకసార్లు పడిపోయానని, పడిపోయిన ప్రతిసారి మరలా ప్రభువు దగ్గరకు పశ్చాత్తాపంతో వచ్చి, ఆయన కృపను పొంది ముందుకుసాగానని తన డైరీలో రాసుకొన్నాడు.

ఈ నూతన సంవత్సరంలో మనము కూడా దేవుని సహాయంతో ఆత్మీయ జీవితంలో ఎదగడానికి జోనాథాన్ ఎడ్వర్డ్స్ వలె మంచి తీర్మానాలు చేసుకొందాం. జీవితంలో ఇలాంటి క్రమశిక్షణలను అలవర్చుకొని ముందుకు వెళ్ళడానికి ప్రభువు సహాయం చేయునుగాక.

– డా. నాసరయ్య, వైజాగ్

# వికసించిన పుష్పాలు

## బాధల్లో, శ్రమల్లో, సేవలో...

దేవుని సార్వభౌమ ప్రణాళికలో శ్రమలు కూడా ఉంటాయి. ఆయనయందు విశ్వాసముంచడమే గాక ఆయన పక్షమున శ్రమపడుట కూడా మనకు గొప్ప ఆశీర్వాదమే (ఫిలిప్పీ 1:30). దేవుని ప్రజలపై హింస ప్రబలడం కూడా ఆయన సార్వభౌమ ప్రణాళికలో భాగమే అంటే అతిశయోక్తి కాదు. ఈ సత్యాన్ని అర్థం చేసుకొన్న 'పేతురు' ఏ సమయంలోనైనా శ్రమలు రావచ్చు, అందరూ సిద్ధంగా ఉండమని దేవుని ప్రజలను హెచ్చరించడం గమనార్హం (1 పేతురు 4:12). అంతేకాదు మన ప్రభువై యేసుక్రీస్తు సువార్త కోసం అపోస్తలుడైన పౌలు ఎన్నో శ్రమలు అనుభవించాడు. ఆయన శ్రమలలో పాలివాడగుట యెట్టిదో ఆయన జీవితంలో చూడగలం (ఫిలిప్పీ 3:10,11).

తన శ్రమలకు కారణాల్ని యోబు చెప్పలేదు గాని మన జీవితంలో మంచిని, శ్రమను తెచ్చే అధికారం దేవునికి ఉందనే అచంచలమైన నమ్మకాన్ని గూర్చి చెప్పాడు. శ్రమలు కలిగినప్పుడు దేవుడు మనమేమి భరించాలనుకొంటున్నాడో దేనిని మనం నేర్చుకోవాలనుకుంటున్నాడు వాటిని గ్రహించడం ప్రాముఖ్యమైన అంశం. ఓ రోజు హడ్సన్ టేలర్ ఒక గ్లాస్‌ను నీటితో నింపి తన ముందున్న టేబుల్ మీద పెట్టి మాట్లాడుతూ గ్లాసులో నీళ్ళు బయటకు చిందిపడేంత గట్టిగా టేబుల్‌ని పిడికిలితో గట్టిగా కొట్టాడు. ఆ తర్వాత ఇలా చెప్పాడు 'మనం ఎన్నో గడ్డు సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. అయితే మనం వాటిని ఎదుర్కొంటున్నప్పుడు మనలో ఉన్నదేదో అదే బయటకు చిందుతుంది'. అయితే సమస్య ఎక్కువయ్యే కొద్దీ మన గుణం బయటపడుతుంది. మనలను బలహీనపరచడానికి కాదు గానీ మెరుగుపరచుటకే దేవుడు శ్రమలను, శోధనలను మన జీవితంలోనికి అనుమతిస్తాడు. మన శ్రమలు, కష్టాలు దేవుని రాజ్యాన్ని, ఆయన ఉద్దేశాన్ని విస్తరింపజేస్తాయి (రోమా 8:28, ఫిలిప్పీ 1:12). శ్రమలను, బాధలను తట్టుకొని దేవునిలో కొనసాగుతూ ఆయన కొరకు వికసించిన కొంతమంది జీవితాలను చూద్దాం.

### గ్లాడిస్ స్టెయిన్స్



ఆస్ట్రేలియాలో ఆహ్లాదకరమైన జీవితాన్ని వదిలి ఒరిస్సాలో కుష్టురోగుల మధ్య పరిచర్య చేయడానికి వచ్చిన తన భర్త గ్రేహం స్టెయిన్స్‌ను, తన ఇద్దరు కుమారులను కిరాతకంగా కడతేర్చిన కసాయిల పట్ల కోపాన్ని ప్రదర్శించక 'వారిని క్షమిస్తున్నాను' అని పలికిన మహాతల్లి 'గ్లాడిస్' స్పందనకు ప్రపంచమంతా నివ్వెరపోయింది. ఇంకా అక్కడ కుష్టురోగుల మధ్య సేవ కొనసాగిస్తున్న ఆమెను మెచ్చి భారత ప్రభుత్వం పద్మశ్రీ బిరుదునిచ్చి సత్కరించడం ఎంతైనా శ్లాఘనీయం.

### రిచర్డ్ ఉర్మ్‌బ్రాండ్

రుమేనియా (కమ్యూనిస్ట్) దేశంలో రిచర్డ్ ఉర్మ్‌బ్రాండ్ అనే భక్తుడు క్రీస్తుపై తనకున్న నమ్మకం కారణంగా ఆ దేశంలోని వివిధ కారాగారాలలో 14 సం॥లు చిత్ర హింసల పాలయ్యాడు. 'చెరసాలలో నేను గడిపిన కాలం నాకు బాధనిపించలేదు. నా జైలు గదిలో ఒంటరిగా విశ్వాసానికి, ప్రేమకు మించి దేవునిలో ఒక అనిర్వచనీయమైన ఆనందం నేను అనుభవించాను. జైలు నుండి విడుదల అయ్యాక పర్వత శిఖరంపై చిరకాలం జీవించి మాటలకందని మధురానుభూతిలో ఓలలాడి కొండ దిగి నేల మీదికి వచ్చినట్లుగా నాకు అనిపించింది' అన్నాడు రిచర్డ్ ఉర్మ్‌బ్రాండ్.



### బ్లాండీనా

క్రైస్తవులను హింసిస్తూ చూడడం రోమీయులకు ఒక వేడుక. ఈ హింసలను స్టేడియంలో ఏర్పాటు చేసేవారు. ఉదయం నుండి రాత్రి వరకు ఆమెను



హింసించిన హింసకులు అల సిపోయారే గాని వాటిని తట్టుకొనేలా దేవుడు ఆమెకు కృప దయచేశాడు. ఆమె శరీరం చీల్చబడ్డా దైవకృపతో నింపబడి క్రీస్తునందు ఆమెకున్న నమ్మకాన్ని గూర్చి గట్టిగా సాక్ష్యం చెప్పింది 'బ్లాండీనా'. ఆదిమ సంఘ కాలం తర్వాత శ్రమల ను అనుభవించిన స్త్రీలలో ఒకరు. ఎత్తైన కొయ్య మీద ఆమెను వ్రేలాడదీసి, అడవి మృగాలను ఆ కొయ్యి కింద వదిలిపెట్టారు. అప్పుడొక గొప్ప అద్భుతం జరిగింది. దీన్ని చూస్తున్న విశ్వాసులందరికి ఆమె శరీరంలో సిలువ వేయడిన క్రీస్తు కనపడ్డాడు. దాని ద్వారా వారెంతో ఆదరించబడి బలపడ్డారు. ఆ అడవి మృగాలు ఆమెను ముట్టలేదు, క్రీస్తును ధరించిన 'బ్లాండినా' తన శత్రువులను ఎదిరించడానికి అందరికంటే బలవంతురాల య్యింది.



## జిమ్ ఎలియట్

20వ శతాబ్దంలో అమెరికా నుండి ఈక్విడార్‌కు వెళ్ళిన 'జిమ్ ఎలియట్' వారి బృందం అనాగరికులు, అడవి జంతువుల మధ్య కనీస వసతులు లేకపోయినా కష్టపడి సేవ చేశారు. బయటి ప్రపంచంతో ఎటువంటి స్నేహం గానీ సంబంధబాంధవ్యాలు లేని క్రూరజాతిని చేరుకొని వారికి క్రీస్తు ప్రేమను చూపించాలని తహతహలాడారు. చివరికి అక్కడి వారి బళ్ళేలకే బలై పోయారు. కానీ వారి ఆత్మ త్యాగాలు, అనాగరికుల ఆత్మ రక్షణకు విత్తనాలుగా మారి భూమిలో పడి చచ్చిన గోధుమ గింజలవలె విస్తారమైన ఫలాన్ని తీసుకొని వచ్చింది. అనేక సం॥రాల తర్వాత ఆయన భార్య ఎలిజబెత్, వారి కుమార్తె తిరిగి ఆక్వా తెగ వారి వద్దకు వెళ్ళి సువార్త ప్రకటించారు. అనేకమంది ఆక్వా తెగ వారు యేసుక్రీస్తును తమ స్వంత రక్షకునిగా అంగీకరించారు. గోధుమ గింజ భూమిలో పడి చావకుండిన యెడల అది ఒంటిగానే యుండును. అది చచ్చిన యెడల విస్తారముగా ఫలించును (యోహాను 12:24).

## విలియం టిండేల్

రోమన్ క్యాథలిక్ పోప్‌ల ప్రభుత్వ పునాదులను వేళ్ళతో సహా పెకలించడానికి దేవునిచేత ఎన్నుకోబడి, కొత్త నిబంధన గ్రంథాన్ని మొదటిగా ఆంగ్లములోనికి అనువదించిన విలియం టిండేల్‌ను క్రీ.శ. 1536లో నెదర్లాండ్స్‌లోని విల్‌వార్డె పట్టణంలో చంపడానికి ఒక స్థలానికి తీసుకొచ్చారు. అక్కడ ఒక స్తంభానికి అతనిని గొలుసులతో కట్టి, ఉరితీసేవాడు అతనికి శ్వాస ఆడకుండా గొంతు పిసికి, కొన ఊపిరితో ఉండగా అగ్నితో కాల్చి చంపాడు. ప్రభువును కలిసికోవడానికి ముందు "ప్రభువా ఇంగ్లాండు రాజు యొక్క కన్నులు తెరువుము" అని టిండేల్ గొప్ప స్వరముతో కేకవేశాడు.



జైలులో ఉన్న సంవత్సర కాలంలో టిండేల్ దైవభక్తితో కూడిన జీవితాన్ని జీవించాడు. శక్తివంతముగా ఉండి, జైలు అధికారి, అతని కుమార్తె, అనేకులు క్రీస్తును అంగీకరించేటట్లు చేశాడు. అంతేకాదు చెరసాలలో ఉండి తన స్నేహితుడైన జాన్‌ఫ్రిత్‌కు రాసిన లేఖలో "నా మనస్సాక్షికి విరోధంగా నేనెన్నడూ దేవుని మాటల నుండి ఒక్క అక్షరమును కూడా మార్చలేదు. ఈ భూమి మీద ఉన్న సమస్తమైన గౌరవమే గాని, ఆనందమే గాని, ధనమే గాని నాకు ఇచ్చినా ఆవిధంగా చేయను' అని అంటాడు.

## జాన్ జి పేటన్

'నేను బతికినా చనిపోయినా క్రీస్తు కొరకే' అంటూ తన 33వ ఏట, 1857వ సం॥ములో నరమాంస భక్షకులు జీవించే న్యూ హైబ్రిడిన్ దీవులకు వెళ్ళడానికి సిద్ధపడ్డ జాన్ గిబ్సన్ పేటన్ మనకొక సవాలు. "నేను చనిపోయిన తర్వాత నా శరీరాన్ని ఎలాగూ పురుగులు తింటాయి. నేను సువార్త నిమిత్తం వెళ్ళినప్పుడు నరమాంస భక్షకులు తింటే ఏమౌతుంది?" అంటూ వారి మధ్యకు వెళ్ళి వారి క్రూరత్వాన్ని, మూఢత్వాన్ని చూసిన పేటన్ భక్తుడు కన్నీటితో వారి కొరకు ప్రార్థిస్తూ, ధైర్యంగా వారి మధ్య పరిచర్య చేయడానికి ముందుకు సాగాడు. అక్కడి ప్రజలు బహు మూఢాచారాలు కల్గినవారు, మంత్ర, తంత్రాలను నమ్ముతూ బలులు అర్పించేవాళ్ళు. అక్కడి వాతావరణం కూడా బహు కలుషితమైనందున, పేటన్ భార్య, చిన్న బిడ్డ కూడా వ్యాధిగ్రస్తులై త్వరలోనే మరణించారు. జ్వరముతో పేటన్ కూడా బాధపడుతూ,



తానే స్వయంగా తన చేతులతో సమాధులు తవ్వి తన భార్యను, బిడ్డను పాతిపెట్టాల్సి వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభువే నన్ను ఆదరిస్తున్నాడు, ఆయన సాన్నిధ్యం నాతో లేకపోతే నాకు మతి చలించి ఉండేవాడిని అంటూ పట్టువిడువని పేటన్ నరమాంస భక్షకుల మార్పు కొరకు పట్టుదలతో ప్రార్థించాడు. వారి మధ్య చేసిన పరిచర్య వలన హైబ్రిడిస్ దీవులలోని 7 మైళ్ళ పొడవు 2 మైళ్ల వెడల్పు ఉన్న "అనివా" ద్వీప వాసులంతా క్రీస్తును అంగీకరించారు. 1899లో పేటన్ 'అనివా' భాషలో కొత్తనిబంధన గ్రంథాన్ని సిద్ధపరిచాడు. నా అంతిమ శ్వాస వరకు నేను సేవలో కొనసాగుతానన్న 'జాన్ పేటన్' ప్రపంచంలోని పలు ప్రాంతాలను సంచరించి ప్రభువు తనకప్పగించిన గొప్ప సేవ చేసి తన 83 వ యేట (1907) ప్రభువు సన్నిధికి చేరాడు.

**జాన్ అలెన్ చౌ**



అక్టోబర్ 2018లో అండమాన్ నికోబార్‌కు రాజధానియైన పోర్ట్‌బ్లెయిర్‌కు వెళ్ళి అక్కడ నిషేధించబడిన 'సెంటినెల్' తెగలకు సువార్త అందించాలనే దర్శనంతో 27 సంవత్సరాల యౌవ్వనస్థుడైన 'జాన్ అలెన్ చౌ' నదీ తీరాన 700 మీటర్ల దూరంలో ఎవరికీ తెలియని ప్రాంతానికి సువార్త ప్రకటన కొరకు ఫిషింగ్ బోట్‌లో వెళ్ళాడు. వారి మధ్య స్తుతికీర్తనలు పాడి, ఎక్సోసా భాషలో సంజ్ఞలు చేసి మాట్లాడి చిన్నచిన్న బహుమతులు అందజేశాడు. వారు మాత్రం వింత అరుపులతో కేకలు వేస్తూ ఇనుప మొనలుగల బాణాల్ని సంధించి 18 నవంబర్ 2018న చంపేశారు. తర్వాత మృతదేహాన్ని నది ఒడ్డున విడిచిపెట్టారు.

బర్మాలో ఒక శాతం (1%) కంటే తక్కువ ఉన్న క్రైస్తవులు ఎంతో శ్రమను, అణచివేతను పొందుతున్నారు. సిరియాలో క్రైస్తవులు రోజు రోజు తగ్గుముఖం పడుతున్నారు, ఎంతో హింసకు, నిరాశతో, వారి జీవితాలు ఎంతో రిస్క్ గుండా వెళ్తున్నాయి. వారి క్రైస్తవ విశ్వాసము ఎంతో సవాలుగా మారింది. వారు ఇంటి నుండి బయటకు వచ్చి మరల ఇంటికి చేరేలోపు ఏం జరుగుతుందో, ఏం చూడాల్సి వస్తుందోనని, ప్రతిఘటించలేని నిస్సహాయతలో ఉన్నప్పటికి క్రీస్తు ప్రేమను వారు విడిచిపెట్టలేదు.

నైజీరియాలో కూడా క్రైస్తవులు వారి విశ్వాసాన్ని బట్టి హింసలకు/శ్రమలకు గురవుతున్నారు. అలాగే చైనా దేశములో క్రైస్తవుల కంటే కమ్యూనిస్టు పార్టీలో సభ్యులు పెరుగుతున్నారు. క్రైస్తవ సంఘాల్ని కూల్చివేస్తున్నారు. ఇలా ప్రపంచ నలుమూలలా శ్రమల్లో, బాధల్లో ఉంటున్నా వారు దేవునితో నడుస్తూ వికసించిన పుష్పాలుగా ప్రభువుని మహిమపరుస్తున్నారు.

శ్రమలు, పరీక్షలు, క్లిష్టపరిస్థితులు మనకు దు:ఖం కల్గించినా అవి మనల్ని మరింత ఆధ్యాత్మికంగా ఎదిగేందుకు, విశ్వాసంలో మరింత బలపడేందుకు ఉపయోగపడతాయి. శ్రమలు, బాధలు మనకు ఆనందంగా ఉండవు కానీ వాటిలో నమ్మకంగా కొనసాగితే ప్రభువుకొరకు గొప్ప సాక్షులంగా జీవిస్తాము.

పగలు - రాత్రి, వెలుగు - నీడలు పక్క పక్కనే ఉన్నట్లు. జీవితంలో కష్టసుఖాలు కలిసే ఉంటాయి. రాత్రి/చీకటిలో వెన్నెల ఉన్నట్లు కష్టాలలో/శ్రమలలో క్రీస్తు ఆదరణ, ఆయన సన్నిధి మనతో ఎప్పుడూ ఉంటుందని మర్చిపోకూడదు. యోసేపు జీవితం అంతా తుఫానుమయం, అన్నలకు పీకల దాకా కోపం, తప్పుడు ఆరోపణపై జైలుకెళ్ళడం, దేవుని కోసం అన్నిటిని ఓర్చుకొన్నాడు, విధేయత నేర్చుకొన్నాడు. అతని విధేయత ఫలభరితమైన జీవితానికి బలమైనపునాది అయ్యింది, చివరకు ప్రధానమంత్రిగా నియమితుడయ్యాడు. భక్తుడైన పౌలు గారు కూడా ఆయన శ్రమలలో పాలివాడనగుటకు, పునరుత్థాన బలమును ఎరుగుటకు సమస్తమును నష్టపరచుకొన్నాడు, వెనుక ఉన్నవి మరచి ముందున్న వాటి కొరకు వేగిరపడ్డాడు. అనేక సంఘాలను స్థాపించి, విశ్వాసులను ప్రోత్సహిస్తూ పత్రికలు రాశాడు. గనక ఆయన బిడ్డలంగా మనం కూడా నమ్మదగిన దేవుని పిల్లలంగా ఆయన పరిచర్యలో/సేవలో, బాధలు, శ్రమలనే ఎడారిలో వికసించిన పుష్పాలుగా ఉంటూ ఈ నూతన సంవత్సరంలో సాగిపోదాం.

**- డా. ఇశ్రాయేలురాజు వి.** విశాఖపట్నం



# ఇకనైనా ఫలిస్తా

దేవా...
నాపై నీ ప్రణాళిక
మహోన్నత శిఖరం!
నీ ఉద్దేశం
లోతైన సంద్రం!

నేర్పరియైన శిల్పిలా
నీ పోలికలో నిర్మించావు
పచ్చని చెట్టులా ఫలించమని
నాలో తలాంతు విత్తనాన్ని నాటావు

నీదైన సమయంలో
ఆశతో కన్నులెత్తి చూశావు
ఎంత వెదకినా
అయ్యో... నాలో ఫలాలు లేవే!

ఉన్నవన్నీ
పక్వమొందని పిందెలు
నేలరాలిన కాయలు
పొట్ట విప్పితే పురుగులు

నా నిష్ఫల తీగెలు
నీ హృదయంలో ముళ్ళులా
గుచ్చుకున్నాయి
ఆశతో వెదకిన కళ్ళల్లో
కన్నీటిని తెప్పించాయి


ఫలించని కలలన్నీ
నీ మనసుని చలింపచేశాయి
నెరవేరని ప్రణాళికలన్నీ
బాధతో విలపించాయి
అయినా నాపై
నీ శాంతమెంత సుదీర్ఘమైనదో!
నీ కృపెంత కొలతల్లేనిదో!

నాడు ఫలించని అంజూరపు చెట్టులా
వెంటనే నన్ను శపించలేదు
నా వేర్ల దగ్గర నీ గొడ్డలికి
పని చెప్పనూలేదు

నీవు ప్రేమతో పొడిగించిన
ఈ జీవితకాలం
ఫలించడానికి నాకిచ్చే
మరో సదావకాశం

ఇకనుండి
నీ సజీవవాక్య ఎరువులతో
నా సారాన్ని పెంచుకొంటాను!
నీ సన్నిధిలో వేరు పారి
ఇకనైనా ఫలిస్తాను!!

– యస్. ఈశ్వర్ (ఆర్కిటెక్ట్), హైదరాబాద్




# గర్వం

'నీ జీవితంలో నీవు ఎదుర్కొనే అతి బలమైన శత్రువు గర్వమే' అని అన్నాడు డా. జాన్‌స్టాట్. ఈ స్టేట్‌మెంట్‌లో ఎంతో నిజం దాగి ఉంది. ఎందరో మహానుభావులు, గొప్పవారు, చిన్నవారు, స్త్రీ, పురుషులు, విశ్వాసులు, అవిశ్వాసులు ఈ శత్రువు బారినపడి తమ స్థానాల్ని కోల్పోయారు. ఈ శత్రువు మానవులను పతనానికి నడిపిస్తాడని సామె 16:18లో చూస్తాము. వ్యభిచారం, దొంగతనం, హత్య మొదలగు పాపాల వెనుక గర్వం దాగి ఉంటుంది. ఒక విధంగా చూస్తే వాటి ప్రారంభం గర్వంతోనే మొదలవుతుంది. గర్వం ప్రతి పాపము యొక్క మూలముగా గుర్తించవచ్చు. కానీ ఈ దినాలలో గర్వం ఒక కోరదగిన లక్షణంగా, ఒక హీరోకి ఉండాల్సిన ఆభరణంగా చూపిస్తున్నారు. దానికి పేరు మార్చి అభిమానమని, రోషమని, ధైర్యమని, శక్తని పిలవడం మానవ హృదయాంధకారాన్ని చాటి చెప్తుంది. గర్వపడడానికి వయసు, అంతస్తు, సామర్థ్యం అక్కర్లేదు. అది మానవస్వభావంలోని అంతర్గత భాగం. పాత స్వభావంలోని ప్రాముఖ్య కోణం. స్వీయచిత్తం వెనుక నేపథ్యం కూడ గర్వమే. నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమించమని చెప్పే దేవుని ఆజ్ఞలో నుండి పొరుగు వానిని బయటకు గెంటివేసేది గర్వమే! సామెతలు 6:16లోని ఏడు భయంకర పాపములలో మొదటిది గర్వమే. గర్వం ఎక్కడ ఉన్నా అవిశ్వాసులలోగాని, విశ్వాసులలోగాని వారు దేవుని కోపానికి గురికాక తప్పదు. ఎందుకంటే ఆయన నొక్కి చెప్పిన మాట "దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహించును" (1 పేతురు 5:5), దేవుడే మనకు వ్యతిరేకి అయితే ఇక మన స్థితి ఏమిటి? (యాకోబు 4:6).

## ప్రారంభం

విశ్వంలో గర్వము మొదటి పాపముగా దైవగ్రంథం వివరిస్తుంది (యెష 14:12-15). దేవుని సృష్టిలో అతిజ్ఞానవంతుడు, ఘనుడైన లూసిఫర్ అనే దేవదూతలో ఈ గర్వం అనే పాపం మొదటిగా ఉత్పత్తి అయింది. దేవుని ప్రేమించి, ఆయనకు లోబడడానికి బదులు ఆయనకంటే పైగా తన స్థానాన్ని హెచ్చించుకొని పరలోకములో తన స్థానాన్ని కోల్పోయాడు. గర్వము దేవదూతను దయ్యముగా మార్చివేసింది.

దేవుని సృష్టిలో ప్రథమ మానవులను పాపములోనికి తోసివేయటానికి సాతానుడు వాడిన పన్నాగము కూడా గర్వమే! వారు దేవుని ఆజ్ఞ మీరుట చేత దేవునిలాగ మారిపోతారని చెప్పి వారిలో దేవునిపై అనుమానాన్ని, వారి హృదయములో దేవుడు అనుగ్రహించిన స్థానం కంటే పై స్థానం కోరుకొనేటట్లు గర్వాన్ని ప్రవేశపెట్టి వారు పడిపోవడానికి కారణమయ్యాడు. అందుకే గర్వం ప్రతి పాపానికి వెనుక ఉండే దృక్పథ నేపథ్యంగా గుర్తించాలి. ఈనాడు సాతాను నిన్ను, నన్ను పాపంలో పడవేయడానికి ఉపయోగించే అతి బలమైన, విపత్కరమైన ఆయుధం గర్వం.

## చరిత్రలోని పాఠాలు

దేవుడు ఇశ్రాయేలు ప్రజలను ఐగుప్తు నుండి విడిపించి, 40 సంవత్సరాలు అరణ్యంలో నడిపించి చివరకు తనయందు విశ్వాసముంచిన యెహోషువ, కాలేబులను, ఐగుప్తును విడిచివచ్చిన వారి రెండవతరాన్ని కనానుకు చేర్చి తన విశ్వాస్యతను చాటాడు. ద్వితీ 8:2లో, అరణ్యములో 40 సంవత్సరములు దేవుడు నడిపించినపుడు ఆయన వారిలో నుండి తొలగించాల నుకున్న లక్షణం గర్వం. ఆయనను వారు ప్రేమిస్తున్నారో లేదో పరీక్షించడానికి, వారి హృదయంలోని గర్వాన్ని అణచటానికి ఆయన అనేక పరిస్థితులలో నుండి వారి ని తీసుకొని వెళ్ళినట్లు గమనించగలం. విశ్వాసులను కూడ ప్రభువు శ్రమలు, ఇరుకు మార్గములో నుండి నడిపించటానికి కారణం వారిలోని గర్వాన్ని దూరం చేయటానికేనని గుర్తించాలి.

సమృద్ధి, సుఖము, ధనభోగాలను సరైన దృక్పథంతో చూడకపోతే గర్వాన్ని ఆహ్వానించినవారమవుతాం. ద్వితీ 8:11-14 వచనాల్లో గర్వాన్ని గూర్చిన హెచ్చరికల్ని చూస్తాం. గర్వము దేవుని ప్రేమను మరచిపోయేటట్లు చేస్తుంది. దేవుని కృపను, సామర్థ్యాన్ని గుర్తించకుండా చేస్తుంది. దేవుని కాపుదల ను మరచి, అది తన సామర్థ్యమేయని గర్వించడానికి అవకాశం ఉంది (ద్వితీ 8:17). విశ్వాసులు ఈ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఉంది. దేవుని దగ్గర దీనమనసును కలిగియుండటానికి నేర్చుకోవాలి.

రాజైన ఉజ్జియ వృత్తాంతం కూడా మనకొక హెచ్చరి క. ఉజ్జియ ఒక విశ్వాసిగా, దేవునికి ప్రియుడిగా తన రాజరిక జీవితం ప్రారంభించాడు. చిన్నవయసులో, 16వ ఏట రాజుగా ఉంటూ దేవుని మార్గములో జీవించడానికి మొదలుపెట్టాడు. జెకర్యా అనే యాజకుని పర్యవేక్షణలో దేవునిని ఆశ్రయించాడు (2 దిన 26:5). దాని కారణంగా దేవుడు అతనికి గొప్ప వృద్ధి కలుగజేశాడు. యుద్ధాలలో జయాన్ని అనుగ్రహించాడు. రాజకీయంగా, సైన్యపరంగా, ఐశ్వర్యపరంగా ఎంతో అభివృద్ధి సాధించిన తర్వాత అతనిలో గర్వము ప్రారంభమైంది (దిన 26:15,16). దేవునిపై ఆధారపడడం తగ్గిపోయింది. తన స్వశక్తి, తెలివితేటలపై ఆధారపడడం మొదలుపెట్టాడు. దేవుని ఆజ్ఞలను లెక్కచేయలేదు, చివరికి దేవుని శాపానికి గురై భ్రష్టుడైపోయాడు. మనం ఆర్థికంగా, శారీరకంగా, విజయవంతులం, సమృద్ధి గలవారమైనప్పుడు గర్వించడానికి ఎంతో అవకాశం ఉంది.

## విశ్వాసులలో గర్వం

గర్వం ఎవరిని విడచిపెట్టదు. నిజమైన భక్తి విశ్వాసిని దీనత్వం, తగ్గింపు జీవితానికి నడిపించాలి. కానీ అజాగ్రత్తపరులైన విశ్వాసులు తమ ఆత్మీయ అభివృద్ధినిబట్టి గర్వించి నష్టపోతారు. తోటి విశ్వాసుల ను విమర్శించడం, తక్కువచేసి మాట్లాడడం, వారి మాటల్లో కనబడుతుంది. లూకా 18:19-14 లో ప్రభువు వివరించిన సుంకరి, పరిసయ్యుని ఉపమానం ఈ సత్యాన్ని వివరించినా, చాలామంది విశ్వాసులు, నేను ఈ పరిసయ్యుని వంటివాడను కాను అని గర్విస్తారు.

గర్వం ప్రతి మానవునిలో వివిధ రకాలుగా ప్రత్యక్షమవుతుంది. కాలేజ్‌లో ర్యాగింగ్ గర్వం యొక్క మారురూపమే. అత్తా కోడళ్ళ మధ్య వైరంలో గర్వం తనవంతు పాత్రను పోషిస్తుంది. భర్త నాయకత్వంలోని 'పెత్తనం' గర్వం యొక్క పర్యాయపదం. భార్య

లోబడకపోవడం గర్వం కాదని ఎవరు చెప్పగలరు. సంఘ నాయకుల మధ్య గల కలహాలకు, ఇఇయఫ్ గ్రాడ్యుయేట్స్ మధ్య గల పోటీకి, గ్రూపిజాలకు కారణం గర్వమే. బోధకులు తమ ప్రసంగాలను బట్టి గర్వించి, దైవసందేశాలకు బదులు స్వంత జ్ఞాన సందేశాలతో పతనమైన ఉదాహరణలెన్నో గమనించగలం.

గర్వం - నేనే ప్రధానం, నేను అన్ని చేయగలను అనే దృక్పథంలో నుండి వస్తుంది. టీం వర్క్‌కు ప్రధాన శత్రువు గర్వమే. గర్వాన్ని ఒక దైవజనుడు ఆత్మీయ క్యాన్సర్‌తో పోల్చి, అది ప్రేమించే స్వభావాన్ని, తృప్తి అనే భావాన్ని, గౌరవం అనే మర్యాదను తినివేస్తుందని పేర్కొన్నాడు. గర్వం విశ్వాసి హృదయంలోని దేవుని స్థానాన్ని కేంద్రం నుండి అంచులకు నెట్టేస్తుంది. ఆ స్థానాన్ని 'అహం' ఆక్రమిస్తుంది. దేవుని స్థానాన్ని ఆక్రమించటం ద్వారా తీర్పు తీర్చడానికి, పగ తీర్చుకోవడానికి, విమర్శించడానికి, పొగడ్తలను కోరుకోవడానికి, గుర్తింపు కోసం ఆశపడడానికి ప్రారంభిస్తుంది. గర్వము సంబంధాలను తెంచేసి, ఐక్యతను ఛిద్రం చేస్తుంది.

సామాన్యంగా గర్వాన్ని ఇతరులలో చూడడం చాలా సులభం గానీ మనలోని గర్వాన్ని అంగీకరించడం కష్టం. మనలో ఉన్న గర్వాన్ని గుర్తించడానికి కొన్ని ప్రశ్నలు వేసుకోవచ్చు. నన్ను ఇతరులు లెక్కచేయనప్పుడు లేదా నా ఉనికిని ఇతరులు గుర్తించనప్పుడు నా ఆలోచన ఎలా ఉంటుంది? నన్ను ఇతరులు విమర్శించినప్పుడు నా స్పందన ఎలా ఉంటుంది? అంగీకరించను, ఇతరులు నా ఉనికిని గుర్తించనప్పుడు నాకు చాలా బాధకలుగుతుందని నీవంటే నీకు గర్వం ఉన్నట్లే. మనలోని గర్వం గుర్తించడం చాలా కష్టం. అది ఆత్మీయత వెనుక కూడ దాగి ఉంటుంది. నా ప్రసంగం వినే వారందరి కంటే నేను తక్కువవాడననే దృక్పథం లేకపోవడం గర్వంలోంచి వస్తుంది. నేను వాళ్ళకంటే గొప్ప, వాళ్ళకంటే మంచివాడను, అతని లాంటివాడను కాను, ఆమె లాంటి దానను కాను అని అనుకొంటూ మనలను మనమే మెప్పించుకోవడం గర్వమే. 139వ దావీదు కీర్తనలో దావీదు చేసిన ప్రార్థన మన ప్రార్థనైయుండాలి. "దేవా! నీకు ఆయాసకరమైన మార్గము నాయందున్నదేమో చూడు" అని ప్రార్థించుకోవాలి. పశ్చాత్తాపంతో పాపాన్ని ఒప్పుకొని ప్రభువు దృష్టికి మనలను మనం తగ్గించుకోవాలి (యాకోబు 4:10). గర్వానికి విరుగుడు సాత్వీకం. ఇది మన స్వభావం కాదు. ఆత్మదేవుడు సృష్టించిన నూతన స్వభావము (కొలస్సీ 3:10)లో నుండి ఉత్పత్తి అయ్యే ఆత్మఫలము.

## గర్వంపై విజయానికి మార్గం (మత్తయి 11: 29,30)

ప్రభువైన క్రీస్తు మనకందరికి విస్తరింపజేసిన ఆహ్వానం ఈ వచనాలలో చూడగలము. ఈ వచనాలలో శిష్యరికానికి ఆహ్వానం ఉంది. ప్రభువు వారి సార్వభౌమత్వంలో, తండ్రిని గూర్చిన ప్రత్యక్షత కేవలము పసిబాలుర వంటి విశ్వాసము, నిష్కల్మష హృదయము, అన్నిటికంటే ఎక్కువగా దీనమనసు గల వారికి మాత్రమే లభిస్తుంది (11:25). ఇది దేవుని దృష్టికి అనుకూలమైనది. ఎందుకనగా అతిశయం, గర్వం ప్రభువు ఇవ్వదలచుకున్న దేవుని సత్యానికి ప్రధాన ఆటంకాలు. అతిశయంతో ఉండేవాళ్ళు దేవునిగూర్చి ఎరుగుదురు గాని దేవునిని ఎరుగరు. దేవునిని లేక తండ్రిని ఎరగడానికి ప్రధాన షరతు దీనమనసు, తగ్గించుకొనే హృదయం.

ప్రభువు కాడి కిందకు రావడానికి ఎవరు ఇష్టపూర్వకంగా సమ్మతి తెలుపుతారో, వారికి మాత్రమే ఆయన సాత్వికము మరియు దీనమనసును గూర్చిన శిక్షణ అనుగ్రహించి, ఆయనయొద్ద నేర్చుకొనే భాగ్యాన్ని ఇస్తాడు. శిష్యుడు అనగా ఆయన కాడిని మోయుటకు అంగీకరించినవాడే. ఆయన కాడి అనగా పరిశుద్ధాత్మ దేవుని ప్రభుత్వము కిందకు వచ్చుట. అక్కడే గర్వము విరుగగొట్టబడి సాత్వీకము, దీనమనసు నేర్చుకుంటాము.

ప్రియ గ్రాడ్యుయేట్, ప్రియ విద్యార్థి! ప్రభువు నిన్ను తన శిష్యునిగా అంగీకరించాడా? గర్విష్టులకు ఈ బడిలో సీటు దొరకదు. ఇది ఇరుకు మార్గము, అసాధ్యం అనిపిస్తుంది కానీ ఆయన కాడి ఎత్తుకోవడానికి తమ అంగీకారం తెలిపి వచ్చిన వారికి అది సుళువు అని, తేలిక అని అర్థమవుతుంది. ఎందుకనగా కుడి చెంప మీద కొడితే ఎడమ చెంప తిప్పడానికి, ఒక మైలు రమ్మంటే రెండు మైళ్ళు వెళ్ళడానికి, పెద్దవారు అందరి కంటే తక్కువవారిగా ఎంచుకోవడానికి, తమకంటే చిన్న వారి పాదాలు కడగడానికి ఆత్మ దేవుడే తగిన శక్తి అనుగ్రహించి బలపరుస్తాడు.

**– కె. దేవిడ్ రాజ్‌కుమార్,** గుంటూరు

ప్రత్యేకం



# నిరీక్షణకు
## పది ఆశీర్వాదాలు

నిరుత్సాహకరమైన వార్తలు, పరిస్థితులు దేశాన్ని, సంఘాన్ని, మనసులను చుట్టుకొని అధైర్యపరిచే సమయంలో, మన తలలు, హృదయాలు, చేతులు పైకెత్తడానికి అంటే, ధైర్యంగా ఉండడానికి మనకు దేవుని సహాయం అవసరం. మనం భయపడకుండా ఉండడానికి ఈ మాటలు, వ్యాసాలు మనల్ని ప్రోత్సహిస్తాయి. అయితే, ఒకసారి భయాన్ని వెళ్ళగొట్టిన తర్వాత, దాని స్థానంలో దృఢమైన క్రైస్తవ నిరీక్షణను అభివృద్ధి చేసుకోవాలి. ఈ నిరీక్షణ అద్భుతమైన లక్షణం మాత్రమే కాదు, జీవితాలను మార్చే కృప కలిగినదై, అనేక ఆశీర్వాదాలను తీసుకువస్తుంది. ఆ ఆశీర్వాదాలు ఏమిటో చూద్దాం.

### 1. పరిస్థితులకు అతీతంగా ముందుకు తీసుకెళ్తుంది

నమ్మదగిన దేవుని వాక్య ఆధారంగా, భవిష్యత్‌లో జరిగే మంచికోసం, పొందబోయే మహిమకోసం వాస్తవ దృక్పథంతో, సంతోషంగా ఎదురుచూడడమే క్రైస్తవ నిరీక్షణ. భవిష్యత్ కోసం మనం ఎంతగా ఎదురుచూస్తామో, గత జీవితానికి సంబంధించిన విషయాల కోసం అంత తక్కువగా ఆరాటపడతాము. దు:ఖాలను, చింతలను, నెరవేరని ఆశలను నిరీక్షణ తొలగిస్తుంది. ఆటంకాలను, ప్రతిబంధకాలను తొలగించి, విశ్వాస జీవితానికి ఉత్సాహాన్ని తీసుకొస్తుంది.

### 2. ప్రస్తుత జీవితానికి శక్తిని ఇస్తుంది

ఈనాటి మన జీవితం నిరీక్షణతో జీవించడానికి యోగ్యమైనది, శక్తిని ఇచ్చేది. ఎందుకంటే నిత్యత్వమనే రేపటి దినం చాలా ఆశాజనకమైనది. అవిశ్వాసులైన లోకస్థులకు మహాప్రళయంగా ఉండే ఆ రోజున మనకు పట్టాభిషేకం జరుగుతుంది.

### 3. ప్రతికూలతల్లో వెలుగునిస్తుంది

గాఢాంధకారమైన, వేదనాభరితమైన పరిస్థితులు రావు అని నిరీక్షణ అభయమివ్వదు. గానీ ఈ లోయల్లో ప్రయాణిస్తున్న మనకు వెలుతురును ఇస్తుంది. సూర్యోదయం రాబోతుంది అని మనకు తెలియజేస్తుంది.

### 4. పరిపూర్ణ విశ్వాసాన్ని వృద్ధి చేస్తుంది

విశ్వాసం నిరీక్షణను వృద్ధి చేస్తుంది, విశ్వాసాన్ని పురిగొల్పుతుంది. హెబ్రీ 11వ అధ్యాయం స్పష్టంగా తెలియజేస్తున్న విధంగా, నిరీక్షణ విశ్వాసాల మధ్య ఎంతో గొప్ప సంబంధం ఉన్నది. ఒకటి మరొకదానికి జీవం పోస్తుంది. విశ్వాసం నిరీక్షణకు రెక్కలు వంటిది. నిరీక్షణ లేకపోతే విశ్వాసం కుంటిదవుతుంది. గొప్ప

విశ్వాసవీరులు గొప్ప నిరీక్షణ కలిగిన వీరులు. గొప్ప నిరీక్షణ కలిగిన వీరులు గొప్ప విశ్వాసవీరులు.

### 5. ప్రభావితం చేస్తుంది

మన నిరీక్షణ ద్వారా ఇతర విశ్వాసులను ప్రేరేపించవచ్చు. పడిపోయిన విశ్వాసులను నిలబెట్టడమే కాకుండా, నిరాశ నిస్పృహలతో ఉన్న అవిశ్వాసులను ప్రభావితం చేస్తుంది. మనలో ఉన్న ఈ నిరీక్షణకు కారణమేంటి అని వారు మనల్ని అడిగేలా చేస్తుంది (1 పేతురు 3:15).

### 6. స్వస్థత కలిగిస్తుంది

కృంగిపోయిన వారిని కౌన్సిల్ చేసేటప్పుడు, మొదట చేయాల్సిన పని ఏమిటంటే వారిలో నిరీక్షణ నింపడం. కృంగిపోవడం అనేమాటకు అర్థం ఏంటంటే, నిరీక్షణ లేకుండా ఉండడం. నా బతుకు ఇంతే అని భావించడం. అందుకే, చాలామందిలో మొదట నిరీక్షణ కలిగే విధంగా మాట్లాడాలి. అప్పుడు వారికి కొంత ఉపశమనం కలుగుతుంది. తమ సమస్య నుండి బయటపడే మార్గం వారికి కనిపిస్తుంది. తమ కృంగుదల నుండి ఉపశమనం పొందుతారు. ఆ నిరీక్షణే వారికి గొప్ప స్వస్థత కలిగిస్తుంది.

### 7. ప్రేరణ కలిగిస్తుంది

నిరీక్షణ అంటే ఊహాజనిత లోకం కోసం ఎదురుచూస్తూ కూర్చోవడం కానే కాదు!! పనిని తలపెట్టే వారిగా మనల్ని ప్రేరేపిస్తుంది నిరీక్షణ. సంఘానికి మంచిరోజులు రావాలి అని మనం నిరీక్షిస్తుంటే, సంఘ సేవలో పాల్గొంటాము. మన పిల్లలు రక్షణ పొందాలని మనం నిరీక్షిస్తుంటే, మనం వారికి సువార్తను చెప్పాలనే ప్రేరణ పొందుతాం. దేవుని వాక్యం నుండి దేవుని ఆశీర్వాదాల్ని నిరీక్షిస్తుంటే, ఆసక్తితో దేవుని వాక్యం వింటాం, చదువుతాం. నిరీక్షణ కార్యాన్ని జరిగిస్తుంది.

### 8. పవిత్రతకు నడిపిస్తుంది

ఈ లోకంలో మనం ఎలాంటి శ్రమలు, హింసలు అనుభవిస్తున్నప్పటికీ, మనకు ఒక నిరీక్షణ ఉన్నది. మనం దేవుని బిడ్డలమని పిలవబడడమే కాకుండా, దేవుని కుమారుని పోలికలో మార్చబడే రోజు ఒకటి వస్తుంది. అంతము వరకు సహించి, పరిశుద్ధతలో, పట్టుదలతో అపోస్తలులు కొనసాగడానికి ప్రేరేపించింది ఇదే. “ఆయనయందు



ఈ నిరీక్షణపెట్టుకొనిన ప్రతివాడును ఆయన పవిత్రుడైయున్నట్టుగా తన్ను పవిత్రునిగా చేసికొనును” (1 యోహాను 3:1-3).

### 9. స్థిరత్వాన్ని ఇస్తుంది

రోమా సామ్రాజ్య కాలంలో జరిగిన హింసల నుండి తప్పించుకొని శవాలను దాచిపెట్టే లోయలు, గుహలు, సొరంగాలలో దాక్కొన్న క్రైస్తవులు వారు దాక్కొన్న ప్రదేశాలలో గీసిన లంగరు గుర్తులు అరవై ఆరు ఉన్నాయి. (హెబ్రీ 6:19; 10:34). లంగరులాగ, కనుచూపుకు కానరాని వాటిని లంగరు పట్టుకొంటుంది. ఒక ప్యూరిటిన్ ఇలా రాశాడు: “విశ్వాసమనే తాళ్ళు లంగరు అనే నిరీక్షణను విసరగా, అది దేవుని వాగ్దానాలనే స్థిరమైన రాతికి చిక్కుకొన్నది”.

### 10. కాపాడుతుంది

నిరీక్షణను శిరస్త్రాణముగా అభివర్ణించాడు పౌలు (ఎఫెసీ 6:17; 1 థెస్స 5:8). యుద్ధం ముగిసేవరకు దానిని తీసి కింద పెట్టకూడదు. సులభంగా హానికి గురై, ప్రమాదానికి గురయ్యే మన మనసు, ఆలోచనల నుండి ఈ శిరస్త్రాణం కాపాడుతుందనే విషయాన్ని ఈ వచనాలు తెలియజేస్తున్నాయి. అనుమానం, నిరాశలకు దారితీసే పరిస్థితులను సాతాను కలుగజేసే ప్రదేశం అదే. అందుకే నిరీక్షణా శక్తిచేత మన మనసులను ప్రతిరోజు నూతనపరచుకోవాల్సిన అవసరం ఉన్నది.

– విజే డెస్క్

ప్రత్యేకం



# యథార్థత

"యథార్థత అంటే ఎవరూ చూడనప్పుడు కూడా సరియైన పనిని చేయడమే" అని అంటాడు సి.యస్. లూయిస్.

"ఇంటిగ్రిటి" అనే ఆంగ్ల పదానికి మూలపదం లాటిన్‌లోని 'ఇంటీగర్'. దీని అర్థం "పరిపూర్ణం". మనం పూర్ణసంఖ్య అని మాట్లాడినట్లుగానే పరిపూర్ణ వ్యక్తి, యథార్థత గల వ్యక్తి అంటే నీతిగా జీవించే వ్యక్తి. ఇతను కుటుంబంలో, ఉద్యోగంలో, ఒంటరిగా ఉన్నప్పుడు, ఆర్థిక ఇబ్బందుల్లో ఇలా ఏ పరిస్థితుల్లోనైనా ఒక్కొక్క రకంగా జీవించడు. యథార్థతగల వ్యక్తి బహిరంగ జీవితంలో ఎలా ఉంటాడో ఆంతరంగ జీవితంలో కూడా అలానే ఉంటాడు.

రిక్‌వారెన్ మాటల్లో చెప్పాలంటే 'జీవితంలోని అన్ని విషయాల్లో ఒకేలా ఉండడం'. యథార్థతకు వ్యతిరేకపదమే వేషధారణ. ఇంట్లో ఒకలా, పనిచేసే ప్రదేశంలో మరోలా అందరి ముందు వేరేగా ఉండడం యథార్థత కాదు.

యథార్థత, శీలం, నైతిక పరిశుద్ధతలను గూర్చి బైబిల్‌లో అనేక చోట్ల చెప్పబడింది. "యథార్థహృదయుడవై నీతిని బట్టి నడచుకొనమని" దేవుడు సొలోమోనుకు ఆజ్ఞాపించాడు (1రాజులు 9:4). అలాగే 1 దిన 29:17లో దావీదు ఇలా అంటున్నాడు "నా దేవా, నీవు హృదయపరిశోధన చేయుచు యథార్థవంతులయందు ఇష్టపడుచున్నావని నేనెరుగుదును". కీర్తన 78:70-72లో మనం ఇలా చదువుతాము "అతడు యథార్థ హృదయుడై వారిని పాలించెను". యథార్థంగా ప్రవర్తించువారికి ఆయన ఏ మేలు చేయకమానడు (కీర్తనలు 84:11). యథార్థత గురించి సామెతల గ్రంథంలో కూడా చాలా వచనాలు ఉన్నాయి. "యథార్థంగా ప్రవర్తించువాడు నిర్భయంగా ప్రవర్తించును. కుటిల వర్తనుడు బయలుపడును". యథార్థత గల వ్యక్తికి తన తప్పులు బహిర్గతమౌతాయన్న భయం ఉండదు. యథార్థత జీవితాన్ని ఒక సురక్షితమైన మార్గం గుండా నడిపిస్తుంది (సామె 10:9). "యథార్థవంతుల యథార్థత వారికి త్రోవ చూపించును. ద్రోహుల మూర్ఖస్వభావం వారిని పాడుచేయును" (సామెతలు 11:3). "యథార్థవర్తనుడగు నీతిమంతుని పిల్లలు వాని తదనంతరం ధన్యులగుదురు" (సామె 20:7) యథార్థత ఒక వారసత్వాన్ని వదిలివెళుతుంది. నీతిమంతులు యథార్థంగా జీవించి, తమ పిల్లలకు మంచి మాదిరిని వదిలివెళ్తారు.

## యథార్థత లక్షణాలు:

### నిజాయితీ:

**డబ్బు:** ఒకసారి అబ్రహాం లింకన్ షాప్‌లో పనిచేస్తూ పొరపాటున ఓ వ్యక్తి దగ్గర ఎక్కువ డబ్బులు తీసుకొంటాడు. తన తప్పును వెంటనే గ్రహించి ఆ వ్యక్తికి మరల డబ్బును చెల్లించడానికి సుమారు 6 మైళ్ళు నడుస్తాడు.

**వివాహం:** ముఖ్యంగా పెళ్ళి సందర్భ మాటల్లో ప్రాముఖ్య విషయాల్లో ఇవ్వవలసిన సమాచారంలో యథార్థత ఉండాలి. ఓ పెళ్ళి సంబంధం విషయంలో పెళ్ళి కూతురు తండ్రి "మా అమ్మాయికి ఆరోగ్యపరమైన ఈ సమస్య ఉంది. మీరు ప్రార్థించి మీకిష్టమైతే సంబంధాన్ని పరిగణించండి" అని చెప్పాడు. నేను వారి నిజాయితీకి విస్తుపోయాను గానీ అది తర్వాత

వారి సంతోషకరమైన వివాహ జీవితానికి నాంది అని గ్రహించాను. కొంతమంది గ్రాడ్యుయేట్స్ వివాహ విషయాల్లో కొన్నిటిని దాస్తూ ముఖ్యంగా ఆరోగ్య సంబంధ విషయాలు గోప్యంగా ఉంచుతున్నారు. యథార్థతను వదిలి "వెయ్యి అబద్ధాలు చెప్పి ఓ వివాహం చేయాలనే" లోకసామెతను తుచ తప్పకుండా పాటిస్తున్నారు. ఇది తమ తెలివితేటలకు వారిచ్చే ప్రాధాన్యతే తప్ప అది దేవుని దృష్టిలో వివేకం, అంగీకారం కాదు.


**చదువు:** విద్యార్థులు పరీక్షల్ని యథార్థంగా రాయాలి. కాపీ కొట్టి ప్రథమ శ్రేణిలో రావడం కన్నా నిజాయితీగా సెకండ్‌క్లాస్ వచ్చినా ఫర్వాలేదు. దేవునిపై ఆధారపడడం యథార్థతకు కొలమానం. దీని ద్వారా మనం దేవునిని ఘనపరుస్తున్నామని మరువకూడదు.

**ఆఫీస్:** ఆఫీస్‌లో నిజాయితీగా ఉంటే మన తోటి పనివారి నుంచి ఒంటరితనం అవమానం, నిర్లక్ష్యం ఎదురౌతాయని పి.సి. జాషువా అన్న చెప్తారు. నిజమే, అయితే అలా ఉన్నప్పుడు దేవుని ఘనపరిస్తే గొప్ప ఫలితాలు కూడా వస్తాయి. ఓసారి పి.సి. జాషువా అన్న సాక్ష్య జీవితంతో ప్రభావితమైన బ్రాహ్మణ మేనేజర్ గారు చర్చ్‌కి వచ్చి బహు భయభక్తులతో మోకాళ్ళు వేసి పాస్టర్ గారితో ప్రార్థన చేయించుకొన్నారు. ఇది ఎంత మంచి ఉదాహరణ.

యథార్థత కలిగిన వ్యక్తి కేవలం పై విషయాల్లో గాక అన్ని విషయాల్లో నిజాయితీగా ఉంటాడు.

## నమ్మకత్వం

యథార్థమైన వ్యక్తికి ఉండే మరొక లక్షణం నమ్మకత్వం. నమ్మకమైన వ్యక్తి తప్పు చేయడానికి భయపడతాడు. అతడు/ఆమె ఎలాంటి ఫలితాలు వచ్చినా సరే తమ విలువలకు రాజీపడరు, నమ్మకత్వాన్ని వదులుకోరు. ప్రభుత్వ కార్యాలయాల్లో "ఇక్కడ మంచి, చెడులుండవు, పరిపూర్ణమైన నైతిక విలువలుండవు, ఇక్కడ అంతా మామూలే" అన్న




మాటలు ఎన్నో సార్లు వినాల్సివస్తుంది. నమ్మకంగా ఉండేవారికి ఇవి తప్పని తెలుసు. సమాజ పోకడల కంటే దేవుని వాక్యానికి లోబడవలసిన బాధ్యత మనందరిపై ఉన్నది.

## ప్రైవేట్ లైఫ్:

ఒకసారి అబ్రహాం లింకన్ ఓ మిలటరీ ఆఫీసర్‌తో గుఱ్ఱపు బండిమీద ప్రయాణం చేశాడు. చాలా దూరం ప్రయాణించిన తర్వాత బడలిక వలన మిలటరీ ఆఫీసర్ విస్కీబాటిల్ తీసి చాలా మర్యాదగా అబ్రహాం లింకన్‌కు ఆఫర్ చేస్తాడు. లింకన్ దానిని మర్యాదగా తిరస్కరిస్తాడు. మరల కొన్ని మైళ్ళ ప్రయాణం తర్వాత ఒక సిగరెట్ తీసి పొగతాగి రిలాక్స్అవ్వమని లింకన్‌కు ఆఫర్ చేస్తాడు. అప్పుడు అబ్రహాం లింకన్ ఓ సంఘటన చెబుతాను, ఆ తర్వాత కూడా మీరు తాగమంటే తాగుతాను అని అంటే, మిలటరీ ఆఫీసర్ సరే చెప్పమని అంటాడు.

"నేను తొమ్మిది సంవత్సరాలప్పుడు నా తల్లి మరణశయ్యపై ఉండి నన్ను దగ్గరకు తీసుకొని "జీవితంలో ఎప్పుడూ మద్యం, పొగ తాగనని" ప్రమాణం చేయమని అడిగింది. ఆ తర్వాత ఆమె చనిపోయింది. ఇప్పటి వరకు వాటిని ముట్టకుండా జీవించాను. నా తల్లికిచ్చిన మాటను నిలబెట్టుకోవాలా వద్దా?" అని మిలటరీ ఆఫీసర్‌ను అడిగాడు. వెంటనే ఆ ఆఫీసర్ "సర్ ఎన్నడూ మాట తప్పవద్దు. మీ జీవితంలో అత్యుత్తమ ప్రమాణాల్లో ఇది ఒకటి" అని చెప్పాడు.

యథార్థవంతులలో ద్వంద్వ జీవితం ఉండకూడదు. ఎక్కడ ఉన్నా, ఏమి చేస్తున్నా, ఎవరు గమనించినా, గమనించకపోయినా యథార్థంగా ఉండడానికే ఇష్టపడాలి. దేవుని వాక్య ప్రమాణాలకు కట్టుబడి జీవించాలి.

## బహిరంగ సాక్ష్య జీవితం

మన జీవితంలో కనిపించే క్రైస్తవ సత్యాల ఆధారంగా మన చుట్టూ ఉండే ప్రజలు క్రైస్తవత్వంలోని సత్యాన్ని నిర్ణయిస్తారు. మనం వేషధారులమని వారు తెలుసుకొంటే, ప్రజలు సువార్త సత్యాన్ని అన్వేషించడం మానేస్తారు. క్రైస్తవ్యం సత్యమా, అబద్ధమా అన్నది నీ జీవితమే నిరూపిస్తుంది. నీ అభిప్రాయాలు, పనుల ఆధారంగా ప్రజలు నీవు


ఎలాంటి వాడివో నిర్ణయిస్తారు. కాబట్టి మనం దేన్ని ఎంచుకుంటున్నామో చూసుకోవాలి.

లండన్‌లో ఒక సారి ఒక చర్చ్ పాస్టర్‌గారు ఆదివారపు ఆరాధనను ముగించుకొని ట్రాలీలో తన ఇంటికి వెళ్తున్నాడు. ఆయన ఆ ట్రాలీ డ్రైవర్‌కు ప్రయాణ ఖర్చును చెల్లిస్తే, ఆ డ్రైవర్ ఇవ్వవలసిన చిల్లరకన్నా చాలా ఎక్కువ ఇచ్చాడు. తర్వాత ఆ పాస్టర్‌గారు ఆ చిల్లరను పదిసార్లు లెక్కించి, తనకు రావాల్సిన దానికన్నా ఎక్కువవచ్చిందని తెలుసుకొని, "దేవునికి స్తోత్రాలు. దేవుడు నా అవసరతలు ఇలా తీర్చాడు" అని మొదట అనుకున్నా తర్వాత తనలో తాను చాలా సంఘర్షణపడ్డాడు. చివరికి డ్రైవర్‌కు డబ్బును తిరిగి ఇచ్చివేయాలనుకొని, అతనితో ఇలా అన్నాడు "నీవు పొరపాటున ఎక్కువ చిల్లర ఇచ్చావు". అందుకు ఆ డ్రైవర్ ఇలా అన్నాడు.. "నేను పొరపాటుగా ఇవ్వలేదు. రాత్రిమీరు చర్చ్‌లో ప్రసంగిస్తూ యథార్థత గురించి బోధించారు. అసలు మీకు ఆ యథార్థత ఉందో లేదో పరీక్షిద్దామని అలా చేశాను. ఆ పరీక్షలో మీరు పాస్‌అయ్యారు".

అవిశ్వాసులు మన జీవితాన్ని పరీక్షించినప్పుడు మనం పాస్ అవుతున్నామా? మనం యథార్థంగా జీవిస్తే సువార్త ప్రకటనకు అవకాశాలు వస్తాయి. లేకపోతే, అవకాశాలు కనుమరుగైపోతాయి. యథార్థవంతమైన జీవితాన్ని వృద్ధిచేసుకోమని నేను మిమ్ముగ్ను ప్రోత్సహిస్తున్నాను. గతంలో మనం ఎంచుకున్న మంచి, చెడు నిర్ణయాల సమ్మేళనమే మన ప్రస్తుత జీవితం. మన యుఇయస్ఐ కుటుంబం యథార్థంగా జీవిస్తూ ఈ లోకాన్ని ప్రభావితం చేసేవారంగా, నక్షత్రాలవలె ప్రకాశించాలని ప్రభువు కోరుతున్నాడు. అట్టి కృప పరిశుద్ధాత్మ దేవుడు ఈ నూతన సంవత్సరంలో మనందరికి దయచేయును గాక!

**– దాసరి రాజేష్,** స్టేట్ సెక్రటరీ, టియస్,
హైదరాబాద్

# Bible Quest




1. _______that works is the key word of Epistle of James
2. Faith obeys the _____, controls the _______
3. A genuine faith should produces a change in _________
4. Faith proves itself by ______
5. The test s of our faith produces __________
6. Every _________ and every ___________is from above
7. Faith produces ___________ and ___________
8. Faith ________awaiting Christ's return
9. Faith________ for the afflicted
10. Faith _________discrimination

Please attempt and send us to office correct answers within 10 days.

**Last month key:**

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | B | E | T | H | L | E | H | E | M |
| | | | | E | | | A | | |
| | P | | | R | A | A | M | A | H |
| S | I | M | E | O | N | | | N | |
| | L | | P | D | A | V | I | D | |
| | A | | H | | | | | R | |
| | T | | R | E | P | H | A | E | L |
| | E | | O | | | | | W | |
| | | | N | | | | | | |

*1. M. Ankarao, Guntur*
*2. T. Anand Babu & Koteswari, Chilakaluripet*
*3. R. Suma Srinivas, Staff, Guntur*

Note: Thank you all for your active participation in VJ Cross word Puzzles all these years,

VJ congratulates the readers those who attempted and answered and send correct answers in time.






# ఆయుష్కాలము నీ వరమే!

మరో సంవత్సరం దయాకిరీటంగా దయ చేయబడి నూతనంగా దేహాన్ని అలంకరించింది. ఒప్పుకొని విడిచిపెట్టాల్సిన గతకాలపు పాపాల మీద తాత్కాలికంగా ముసుగువేసి నూతనవత్సరానికి స్వాగతం చెప్పడానికి మనసు తహతహలాడుతోంది.

కొత్త సంవత్సరం...క్యాలెండర్లలో మారుతుందో, క్యారెక్టర్లలో మారుతోందో తేల్చుకోలేక గోడకు కొట్టిన మేకులన్నీ దిగాలుగా చూస్తున్నాయి. క్యాలెండర్ పేజీల ను అలవోకగా తిప్పే చేతులు... చేతల్ని మార్చుకోలేక చేతగానట్లుగా మిన్నకుండిపోయాయి. ఆత్మవిమర్శ స్థానంలో ఆధిక్యత తొంగిచూస్తోంది. 'సజీవుని' పరిచయ స్థానంలో సంపదల మీదో సౌకర్యాల మీదో వ్యామోహం వెనక్కి లాగుతుంది. ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం ఆత్మీయంగా తమను తాము సిద్ధపరుచుకొని ఎదగాల్సిన దేహాలన్నీ కొత్తసీసాలో పోసిన పాతద్రాక్షారసంలా ఒదిగిపోయాయి.

నడకలు, నడతలు అన్నీ... ఇరుకుమార్గాల్ని వదిలిపెట్టి విశాలమార్గాల్లో విహరించడానికి తొందరపడుతున్నాయి. చేసిన పాపాలనో, చేస్తూ వస్తున్న తప్పులనో క్షమించి ఎన్నో నూతన వత్సరాల ను బహూకరిస్తున్న దేవుడి పట్ల కృతజ్ఞత కలిగి ఉండాల్సిన దేహాలన్నీ... కుర్చీల కోసమో, చర్చ్‌లో చేసే ప్రసంగాల కోసమో తమ వ్యక్తిత్వాల అస్తిత్వాల ను అస్తవ్యస్తంగా చేసుకొంటున్నాయి.

***

“తమ్ముడూ... దేవుడు దయామయుడు. నువ్వు తొందరగా కోలుకొంటావు. ధైర్యంగా ఉండు”

“తమ్ముడూ... నీకోసం మనవాళ్లంతా ప్రార్థిస్తున్నారు. ధైర్యంగా ఉండు”

“తమ్ముడూ... చనిపోయిన వాళ్లను తిరిగిలేపిన దేవుడు మనకున్నాడు. ధైర్యంగా ఉండు. దేవుడు అద్భుతం చేస్తాడు” అని చెప్తున్న వాళ్లవంక ఆరాధనాభావంతో చూశాడు శామ్యూల్. కంటిచివర్ల నుంచి కన్నీటిబొట్లు రాలి చెంపలపై జారాయి. వచ్చినవాళ్ళెవరో తెలియదు. అయినా దేవుని ప్రేమనుబట్టి చూడడానికి ఎక్కడెక్కడి నుండో వచ్చి ప్రార్థన చేస్తున్న వాళ్ళవంక కృతజ్ఞతగా చూస్తూ కళ్లతోనే వాళ్లను పలకరించసాగాడు శామ్యూల్. గొంతునుంచి మాటరాదు, కంటిమీద కునుకులేదు. వెలుగుతున్న లైట్లవంక, తిరుగుతున్న నర్సులవంక, చేతి నరాల ద్వారా ఒంట్లోకి నిశ్శబ్దంగా ప్రవహిస్తున్న సెలైన్ బాటిళ్ల వంకా నెలనుండీ చూస్తూనే ఉన్నాడు. తిరుగుతున్న గడియారం ఎవరికోసం ఆగకుండా తన పని తాను చేసుకుపోతున్నట్లుగా రోగుల కివ్వాల్సిన మందులు కేటాయించిన సమయానికి యథాలాపంగా ఇచ్చేస్తున్నారు నర్సులు. ఒక్కో బెడ్ మీద పేషెంటుదీ ఒక్కో వ్యథ. ఆశకీ–నిరాశకీ మధ్య, చావుకీ–బతుక్కీ మధ్య నలిగి పోతున్న మనుష్యులంతా కళ్లనిండా చావుభయాన్ని నింపుకుని అయోమయంగా అటూఇటూ చూస్తూ కాలం గడుపుతున్న వాళ్ళను చూస్తుంటే శామ్యూల్‌కి ఎంతో బెంగగా ఉండేది.

మధ్యమధ్యలో ట్రైనింగ్ డాక్టర్లని వెంటేసుకుని వచ్చి రోగుల్ని, వాళ్ల రోగలక్షణాలని పరిచయం చేస్తున్న సీనియర్ డాక్టర్స్ శామ్యూల్ని చూపిస్తూ "జి.బి సిండ్రోమ్ పేషెంట్. నెలనుండీ ఇక్కడే ఉన్నాడు. ఆక్సిజన్ లెవెల్స్ పడిపోతే కొన్నాళ్లు వెంటిలేటర్ మీద ఉంచాం. షుగర్ లెవెల్స్, బీపీ లెవెల్స్ అమాంతం పెరిగిపోయాయి. వాటిని కంట్రోల్ చేస్తూ వైద్యం చేయడం వల్ల 'ఐదురోజుల ఇంజెక్షన్ కోర్స్' బాగా ఆలస్యమైంది. దాదాపు పోయాడనే అనుకున్నాం. అదృష్టవంతుడు..." అంటూ చెప్పసాగాడు.

మగతతో మూసుకుపోతున్న కనురెప్పల్ని బల వంతంగా మూస్తూ తెరుస్తూ వాళ్లు చెప్పుకొంటున్న మాటల్ని వినసాగాడు శామ్యూల్. 'అదృష్టం' అనే మాట వినగానే అంత విషాదంలోనూ నవ్వొచ్చింది. బతికున్నవాళ్లను 'అదృష్టవంతులు గా', చనిపోయినవాళ్లను 'దురదృష్టవంతులుగా' లెక్కేస్తున్న వాళ్ళ అజ్ఞానానికి మనసులోనే మరోసారి నవ్వుకొన్నాడు. కేవలం బతికి ఉండడమే అదృష్టం కాదని, బతికి ఉన్న కాలంలో నిజదేవునిని గుర్తించి సొంత రక్షకునిగా ఈ లోకం అంగీకరించడమే నిజమైన అదృష్టమని, అలా గుర్తించలేని మానవాళి అంతా 'బతికి ఉన్న దురదృష్టవంతులు' అనుకొన్నాడు. అదృష్టం, దురదృష్టం అనే మాటల్ని ఉపయోగించడం తనకిష్టంలేదు, అంతా దేవుని కృప, ఆయన చిత్తం అనుకున్నాడు. మనకు తెలిసేటట్టుగా మన చావుపుట్టుకలు, మన జీవిత గమ్యాన్ని నిర్దేశించేటట్టుగా మన అదృష్ట - దురదృష్టాలుంటే ఒక మనిషికి మరో మనిషితో, దేవునితో అవసరమేముంటుంది? దేవుని చిత్తం లేకుండా కష్టార్జితాన్నే అనుభవించలేని మానవాళి అదృష్ట దురదృష్టాలను నమ్ముకొని ఆయుష్కాలాన్ని పెంచుకోగలదా?

ఎలాంటి పరిస్థితుల్లో తాను ఆసుపత్రిలో చేరాడో లీలగా గుర్తుకురాసాగింది. స్వాధీనంలో లేకుండా, బరువెక్కిపోయి, స్పర్శలేకుండా, మొద్దుబారినట్లుగా ఉన్న పాదాలను చూసుకుంటున్న కొద్దీ గట్టుతెగినట్లుగా దు:ఖం పొంగుకొచ్చేది. ఎవరో ఇద్దరు మనుషులు రెండు పాదాలను గట్టిగా పట్టుకుని పదునైన చాకులతో కాలి నరాలను కోస్తున్నట్లుగా అల్లాడిపోయేవాడు. గాజుపెంకులను పాదాలపై పోసి బలంగా నొక్కుతున్నట్లు విలవిల్లాడిపోయేవాడు. నిప్పులగుండంపైన నడిపించినట్లుగా వచ్చే మంటలను తట్టుకోలేక కన్నీళ్లు కార్చేవాడు!ఒకరా ఇద్దరా... షిఫ్టులు మారుతున్న సిస్టర్లందరూ తలనిమిరి 'దేవుడు నిన్ను బతికిస్తాడని' చెప్తుంటే అంత బాధనూ మర్చిపోయి ఎంతో ఊరడిల్లేవాడు. జీవితంలో ఎన్నో జరుగుతుంటాయి. ఇలాజరగడం దేవుని చిత్తమని, దీని ద్వారా ఏదో పాఠం నేర్పించడం దేవునికి ఇష్టమని గ్రహించడం మంచిదనిపించింది. కళ్లు మూసుకొన్నాడు శామ్యూల్. కనుకొలుకుల్లో నిలిచిన కన్నీళ్లు మళ్లీ చెంపలపైకి జారాయి. పెదవులు కదలట్లేదు కానీ అస్పష్టంగా వస్తున్న ఏవో మూలుగులు తనను ఉక్కిరిబిక్కిరి చేయడం గమనించాడు శామ్యూల్. డాక్టర్ల వంక నిర్వేదంగా చూశాడు. దేవుని అపారమైన కృప తనపై లేకపోతే ఈపాటికి తన జీవితం ముగిసిపోయేది. దేవుడు తన స్వహస్తాన్ని తనకోసం చాపాడు. మరణ వేదనను దాటించి స్వస్థతను ప్రసాదించాడని తల్చుకుంటున్న కొద్దీ శామ్యూల్ హృదయం భారంతో నిండిపోయింది.

తనలో తానే గొణుక్కుంటూ"ప్రభువా... ఇన్ని సంవత్సరాల జీవిత ప్రయాణంలో నీకెంత విధేయతగా జీవించానో నాకు తెలియదు. ప్రార్థనలో ఎంత సమయం గడిపానో తెలియదు. నీ పరిచర్యలో ఎంత ముందుకెళ్ళానో తెలియదు. గాలికి కొడిగట్టిపోతున్న ఎన్ని విద్యార్థి దీపాలకు నా అరచేతులు అడ్డుపెట్టానో తెలియదు. అయినా నన్ను క్షమించావు, ప్రేమించావు, కరుణించావు. చావుగోతినుంచి బయటికి లాగి ఆయుష్కాలాన్ని అనుగ్రహించావు. నూతన సంవత్సరాన్ని బహుమతిగా దయచేశావు. నూతనజీవాన్ని నాలో నింపి నన్ను నిలబెట్టావు. నా ఆధిక్యతలు, పోగేసుకున్న సంపదలు, వెంటబడిన లోకాశలు, వదలలేని సౌకర్యాలు... ఇవేమీ నన్ను బతికించిన కారణాలుగా కనిపించలేదు. కేవలం నీ కరుణే నన్ను బతికించింది. ఈ నూతన సంవత్సరం నీ వాక్యాన్ని ధరించడానికి, నీ వాక్యాన్ని ప్రకటించడానికి, నశిస్తున్న విద్యార్థుల్ని నీలో నడిపించడానికి కావలసిన కృపను అనుగ్రహించు" అనుకున్న శామ్యూల్ మనసు ఆనందంతో నిండిపోయింది.

– డా. జడా సుబ్బారావు, నూజివీడు

**కోశాధికారి లేఖ**

# ఇవ్వడం భారం కాదు - భాగ్యం

ప్రభువు నందు ప్రియమైన యుఇయస్ఐ-ఏపిలోని కోశాధికారులందరికి, సభ్యులకు, ప్రార్థనా భాగస్వాములకు పరిశుద్ధులును, క్రీస్తు యేసునందు విశ్వాసులైనవారికి నూతన సంవత్సర శుభములు అని చెప్పి రాయునది.

"పుచ్చుకొనుట కంటే ఇచ్చుట ధన్యము" అని (అపో.కా. 20:35) దేవుని వాక్యంలో చెప్పబడింది మరియు సణుగుకొనకయు, బలవంతముగా కాకయు ప్రతి వాడును తన హృదయములో నిశ్చయించుకొనిన ప్రకారము ఇయ్యవలెను; దేవుడు ఉత్సాహముగా ఇచ్చువానిని ప్రేమించును. 2 కొరింథీ 9:7,8.

విద్యార్థుల మధ్య దేవుని రాజ్య నిర్మాణము, దేవుని పని, దేవుని పరిచర్య కొరకు దేవుడు అనుగ్రహించిన వాటిలో నుండి మరలా దేవునికే తిరిగి ఇవ్వడం అనేది విశ్వాసి జీవితంలో ధన్యకరమైన అంశం. దేవుని కొరకు ఇచ్చేటప్పుడు పై రెండు వాక్యాలను అనుసరించి ఐదు విషయాలను గమనంలో ఉంచుకోవాలి. 1. పుచ్చుకొనుట కంటే ఇచ్చుట ధన్యము, 2. సణుగుకొనకుండా ఇవ్వాలి, 3. బలవంతంగా ఇవ్వకూడదు, 4. ముందుగా నిర్ణయించుకున్న ప్రకారం ఇవ్వాలి, 5. ఉత్సాహంగా ఇవ్వాలి. కావున దేవుని కొరకు ఇచ్చే ధనం దేవుని విధానంలో ఇవ్వాలని ఈ నూతన సంవత్సరంలో, నూతన తీర్మానంతో, నూతనోత్సాహంతో దేవుని రాజ్య వ్యాప్తి కొరకు భారంగా గాక, భాగ్యంగా ఇవ్వాలని ప్రార్థిస్తూ...

**గమనిక:** జూన్ నెల 2022లో జరిగిన రాష్ట్ర వార్షిక కౌన్సిల్ (ఏసియం 2022) నిర్ణయం ప్రకారం రాష్ట్రంలోని ప్రతీ ఇయు, ఇజియఫ్ పరిచర్య కోసం పంపించే మంత్లీ కాంట్రిబ్యూషన్‌ను ఏ.పి. స్టేట్ అకౌంట్‌కు పంపించాలని, రాష్ట్ర మరియు నేషనల్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని సమకూడిన మొత్తాన్ని ఎగ్జిక్యూటివ్ కమిటీ విభజించి పంపడానికి, కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ కమిటీకి అనుమతినిస్తూ తీర్మానం చేయడం జరిగింది. కాబట్టి పరిచర్యకు ప్రతి నెలా పంపించే కాంట్రిబ్యూషన్‌ను విభజించకుండా మొత్తాన్ని ఏ.పి. స్టేట్ అకౌంట్‌కు పంపించాలని మనవి.

**స్తుతించండి**

1. మన స్టాఫ్‌కు 100% శాలరీ, అలవెన్స్‌లు ఇవ్వడానికి ప్రభువు చూపిన కృపను బట్టి

**ప్రార్థించండి**

1. యుఇయస్ఐ-ఏపి ఏసియం-2022 తర్వాత పెరిగిన 16.53% బడ్జెట్‌కు అనుగుణంగా ఇజియఫ్‌లు కాంట్రిబ్యూషన్స్ పెంచి పంపేటట్లు
2. స్టైరెట్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కోసం 8 లక్షలు, చాందపిళ్ళ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కొరకు 5 లక్షలు అవసరం
3. యుఇయస్ఐ నేషనల్ వేతన సవరణలకు అనుగుణంగా మన స్టాఫ్‌కు కూడా వేతనాలు పెంచడానికి ఏసియం 2022 నిర్ణయించారు. దీని అవసరత ప్రతి నెల రూ. 70,000/- పెరుగుతుంది.
4. స్టాఫ్‌కు ఐదు ల్యాప్‌టాప్‌లు సబ్సిడీలో ఇవ్వడానికి అవసరమైన 1,20,000/- కొరకు

ఇట్లు
క్రీస్తులో మీ సహోదరుడు

**యస్.ఆర్.డి. కిషోర్ కుమార్**

**AP MONTHLY REQUIREMENT – Rs. 11,41,000/- (16.53% Hike W.R.T present income)**
**MONTHLY REQUIREMENT FOR UESI NATIONAL – Rs. 4,32,000/-**
**TOTAL - 15,73,000**

## NOVEMBER 2022

| Receipts | | Payments | |
|---|---|---|---|
| Opening Balance | 390.00 | Field Staff Salaries | 4,94,703.00 |
| General Fund | 14,66,985.00 | Field Staff HRA, CA, MA & TA | 2,85,603.00 |
| Staff Support | 17,000.00 | Office Staff Salaries | 1,61,149.00 |
| | | UESI | 3,50,000.00 |
| | | Rajasthan | 30,000.00 |
| | | Jammu & Kashmir | 15,000.00 |
| | | APEGF | 3,000.00 |
| | | Girls Depatment | 3,500.00 |
| | | To Gratuity | 50,000.00 |
| | | Office Expenditure | 28,561.00 |
| | | SWF | 62,000.00 |
| | | Closing Balance | 859.00 |
| **Total** | **14,84,375.00** | | **14,84,375.00** |

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No. : **GTR/59/2021-2023**

**Date of Printing: 25-12-2022**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508

# యుఇయస్ఐ -ఏపి క్యాలెండర్ - 2023




ఆకర్షణీయమైన 2023 క్యాలెండర్ (Size 12x25 Inches), యల్ఆర్‌పి-2030 పోస్టర్ నంబూరు ఆఫీస్‌లో సిద్ధంగా ఉన్నాయి. కావలసినవారు త్వరపడండి, ఆర్డర్ చేసుకొండి. కావాల్సిన వారు

**బ్ర. పి. జగదీష్,** లిటరేచర్ అసిస్టెంట్ - (9493240435) ను సంప్రదించండి.

- *డా. జె. సుబ్బారావు* - (9849031587) లిటరేచర్ సెక్రటరీ